ఏప్రిల్ 9న ఉగాది..

నవతెలంగాణ-పటాన్‌చెరు



తెలుగు ప్రజల నూతన సంవత్సరానికి మొదటి పండుగ ఉగాది పర్వదినాన్ని ఏప్రిల్ 9వ తేదీన నిర్వహించుకోవాలని పటాన్‌చెరు పట్టణంలోని పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయించారు. సోమవారం పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. వేద పండితుల సూచనలకు అనుగుణంగా.. మార్చ్ 25న హోలీ పండుగ, ఏప్రిల్ 9న ఉగాది, ఏప్రిల్ 15 నుండి 19 వరకు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పర్వదినాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపానా దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

నమస్తే తెలుగు దినపత్రిక

1

మెదక్

మంగళవారం | 12 మార్చి 2024 | www.navatelangana.com

340 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పటాన్‌చెరు



హైదరాబాద్ నగరం నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పటాన్‌చెరు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కాటేదాన్ పరిసర ప్రాంతాల్లో సేకరించిన 340 క్వింటాల రేషన్ బియ్యాన్ని గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు లారీలో తరలిస్తుండగా.. సోమవారం తెల్లవారుజామున మండలంలోని రుద్రారం చివర్లో గల జాతీయ రహదారి పక్కన గల ఓ దాబా వద్ద పటాన్చెరు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమ రేషన్ బియ్యం గుట్టు రట్టయింది. లారీలో గల 340 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు క్లీనర్‌ను అరెస్టు చేశారు. సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఆసిఫ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా కేతకిలో రథోత్సవం

నవతెలంగాణ-ఝరాసంగం



మొగిలి వనంలో కొలువుదీరిన శ్రీ పార్వతి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి నవాహ్నిక జాతర బ్రహ్మోత్సవాలు ఏడోరోజు (ఆదివారం) వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి పార్వతీ సంగమేశ్వర కళ్యాణమనంతరం ఉత్సవమూర్తులను భక్తులు పల్లకిలో మోస్తూ విమాన రథోత్సవంపై ఆలయం నుండి బసవేశ్వర మందిరం వరకు ఊరేగించారు. రంగు రంగులతో అలంకరించిన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు రథానికి కట్టిన తాళ్ళను పట్టుకుని బసవేశ్వర మందిరం వరకు లాగారు. అక్కడి నుండి మళ్లీ రథాన్ని ఆలయం వద్దకు తీసుకవచ్చారు. రథోత్సవ కార్యక్రమానికి భక్తులు అశేషంగా తరలివచ్చారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన మధ్యాహ్న సమయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, జహీరాబాద్ టౌన్, రూరల్ సీఐలు, ఎస్సైలు, రాజేందర్ రెడ్డిలు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సునీత హన్మంతురావు పాటిల్, ఎంపీటీసీ రజినిప్రియ సంతోష్ పాటిల్, మాజీ సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, ఈవో శశిధర్, జూనియర్ అసిస్టెంట్ శివకుమార్ పాల్గొన్నారు.

చాలీచాలని బస్సులతో తీవ్ర ఇబ్బందులు

ఉర్సు ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాలని మంత్రి ఆదేశం పట్టించుకోని సంబంధిత అధికారులు

వెరసి తీవ్ర ఇబ్బందులు పడుతున్న సామాన్యులు



నవతెలంగాణ-వట్‌పల్లి

మహాశివరాత్రి ఉత్సవాలు ప్రయాణికుల పాలిట కష్టాలు తెచ్చిపెట్టాయి. మండల కేంద్రంలో ఈ సమస్య మరీ తీవ్రంగా ఉన్నది. ఈనెల తొమ్మిది నుంచి ప్రారంభమైన వెంకట కాజా ఉర్సు 39 ఆరాధన ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాలని మంత్రి దామోదర రాజనర్సింహ గతంలోనే అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు సరైనన్ని బస్సులు వేయకపోవడంతో ఉత్సవాలకు వచ్చేవారితోపాటు సామాన్య ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉరుసు ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని ట్రస్టు నిర్వాహకులు ముందుగానే ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ.. భక్తుల రద్దీకి తగినట్లు బస్సుల సౌకర్యం కల్పించడంలో వారు విఫలమయ్యారు. సంగారెడ్డి డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులు నడుస్తున్నప్పటికీ.. భక్తుల రద్దీ పెరగడంతో వేలాడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. నారాయణఖే డిపో నుంచి బొడుమట్పల్లి నుంచి రాయిపల్లి వరకు నడిపినప్పటికీ.. ఆ ప్రాంతం నుంచి జహీరాబాద్ డిపో బస్సులు ఏడుపాయల వరకు బస్సులు కొనసాగుతుండడంతో ఇబ్బందులు లేకుండా పోయాయి. సదాశివపేట, సింగూర్ ఆత్మకూర్, జోగిపేట, సంగారెడ్డి నుంచి వచ్చే ప్రయాణికులు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి

నవతెలంగాణ-రాయికోడ్



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని స్థానిక ఎంపీపీ సిర్గపురం మొగలప్ప అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్, వైద్య సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండి రోగులకు మంచి వైద్యం అందించాలన్నారు. కాగా గత కొన్ని రోజులుగా నీళ్ల రావడం లేదని వైద్య సిబ్బంది ఆయనకు తెలపడంతో.. వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి త్వరలో నీటి సమస్య తీర్చాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రాత్రిపూట డాక్టర్ లేకపో వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది తెలపడంతో.. ఉన్నతాధికారులతో మాట్లాడి రాత్రి సమయంలో డాక్టర్‌ని నియమించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు తో మాట్లాడి విద్యాబోధన సక్రమంగా జరుగుతుందా లేదా అని తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి భోజనంతోపాటు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆడపిల్లలు ఉన్నతమైన చదువులు చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిల సిహెచ్‌ఎం చంద్ర లీల, సుశీల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు

ఆసుపత్రి సిబ్బంది లేక.. వరండాలోనే ప్రసవం

తల్లీ, బిడ్డ క్షేమం..

వెల్దుర్తి మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఘటన

సిబ్బంది నిర్లక్ష్యంపై పలువురి అసహనం




నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద మహిళ పురిటి నొప్పులతో బాధపడుతూ ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వచ్చింది. ఆ సమయంలో అందుబాటులో డ్యూటీ డాక్టర్, ఏఎన్ఎం, ఆయా ఎవరూ కూడా అందుబాటులో లేరు. ఈ క్రమంలో మహిళకు పురిటి నొప్పులు ఎక్కువై.. వరండాలోనే ప్రసవించింది. తల్లీ, బిడ్డ ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు. కాగా ఆయమ్మ ఇంటికి వెళ్లి ఆరా తీయగా.. ఆమె డ్యూటీకి వచ్చినప్పటికీ ఆసుపత్రి లోపలికి పాములు వస్తున్నాయని భయపడి పక్కనే ఉన్న ఇంట్లో పడుకున్నట్టు సమాచారం. ప్రసవ సమయంలో పిండం అడ్డం తిరిగితే ఇద్దరి ప్రాణాలకు ప్రమాదం జరిగి ఉండేదని బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, డాక్టర్లు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు.

10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ


నవతెలంగాణ-గుమ్మడిదల



మండలంలోని అన్నారం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తాజా మాజీ వార్డు సభ్యులు బి.నరహరి పదో తరగతి విద్యార్థులకు వార్షికోత్సవ పరీక్షల కోసం స్టడీ మెటీరియల్, ప్యాడ్ తదితర వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కీర్తిశేషులు బ్యాగరీ నరసమ్మ, సాయిలు జ్ఞాపకార్థం విద్యార్థులకు తనవంతుగా ఈ సాయం చేసినట్టు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని.. అందుకు తనవంతుగా ఎల్లవేళలా సాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా జరిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కుమార్తె త్రిష దామోదర్‌లు ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్, వినోద్‌కుమార్, వాట్పల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రవీందర్ కళ్యాణ్, అందోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆకుల రాంబాబు, గౌరవ అధ్యక్షులు పి. సంతోష్, ఉపాధ్యక్షులు రాజు, కోశాధికారి జి సంతోష్, కార్యదర్శి ఫయాక్, సభ్యులు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బయట పెట్టాల్సిందే..

సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ చైర్మెన్‌ను అరెస్ట్ చేయాలి

బ్యాంకుల ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నాలు

నవతెలంగాణ-సంగారెడ్డి, నారాయణఖేడ్‌రూరల్, పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్











ఎన్నికల బాండ్ల వివరాలను బయట పెట్టాల్సిందేనని, సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌బీఐ మేనేజర్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బ్యాంకుల ఎదుట సోమవారం ధర్నాలు చేపట్టారు. సీపీఐ(ఎం) అఖిల భారత పిలుపులో భాగంగా సంగారెడ్డి, నారాయణఖేడ్, పటాన్‌చెరు, జహీరాబాద్, సదాశివపేట ఎస్‌బీఐ బ్యాంకుల ఎదుట ధర్నాలు చేపట్టి.. అనంతరం బ్రాంచి మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా సంగారెడ్డిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, నారాయణఖేడ్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మాణిక్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు పాండురంగారెడ్డి, సదాశివపేటలో ఏరియా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జహీరాబాద్‌లో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువును ఎస్‌బీఐ ఉల్లంఘించడం సరికాదన్నారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించి, మార్చి 6వ తేదీ కల్లా ఆ వివరాలను ఎన్నికల సంఘానికి అందజేయాలని సుప్రీం ఆదేశించిం దన్నారు. అయితే తమకు జూన్ 30వరకు గడువు కావాలంటూ సుప్రీంకోర్టుకు ఎస్‌బీఐ దరఖాస్తు చేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదన్నారు. 48కోట్ల ఖాతాలు కలిగిన, ఉన్నత స్థాయిలో డిజిటలైజేషన్ జరిగిన, దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ అయిన ఎస్‌బిఐ, రికార్డులు రాతపూర్వకంగా భద్రపరిచామనే పేలవమైన సాకు చూపి గడువు పొడిగించమని కోరడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లోగా తాము సమాచారం అందించలేమని ఎస్‌బిఐ చెప్పడం చూస్తుంటే అధికారంలో వున్న ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు రాకుండా కాపాడేందుకు ఎస్‌బిఐ ఒక కవచంలా వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. బాండ్లు ఇచ్చినవారికి, తీసుకున్నవారికి మధ్య క్విడ్ ప్రోకో భాగోతం నడిచిందని, కొన్నిసార్లు తమకు అనుకూలంగా లేని కార్పొరేట్లపై ఒత్తిడి తెచ్చేందుకు కొన్ని సంస్థలతో దాడులు, బెదిరింపులకు దిగారన్నారు. విరాళాలు ఇచ్చిన వారికి ప్రభుత్వం చేసి పెట్టిన పనుల వివరాలు కూడా బయటకు రావాలని వారు కోరారు. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డిలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మానిక్, మల్లేశం, రాజయ్య, నాయకులు యాదగిరి, అశోక్, కృష్ణ, రమేష్, మహేష్, బాబూరావు, బాల్‌రాజు, శివ, బాలు, ఖేడ్‌లో పార్టీ నాయకులు అరుణ్, సతీష్, రాములు, హరిపాల్, ప్రజా సంఘాల నాయకులు సంతోష్, సంజీవ్, సాయిలు, అంజయ్య, చంద్రయ్య, పటాన్‌చెరులో పార్టీ నాయకులు బి నాగేశ్వరరావు, మూర్తి, సురేష్, బీవీఆర్‌కే రాజు, గంగాధర్, సదాశివపేటలో పార్టీ ఏరియా కమిటీ సభ్యులు రమేష్ గౌడ్, సిపిఎం నాయకులు శ్రీనివాస్, ఏసు గోపాల్ సంజీవులు మల్లేశం, జహీరాబాద్‌లో పార్టీ నాయకులు సలీమోద్దీన్,బక్కన్న ముజాహెద్, మసి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అట్టహాసంగా మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా ఆగం సాయి చరణ్ అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. డీఎంఏ ఛాయాదేవి సాయి చరణ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్‌చార్జి, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా సాయి చరణ్.. మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతీ రైతుకు చేరవేస్తానన్నారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి సర్వదా కృషి చేస్తానన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు భారీ గజమాలతో చైర్మెన్ కుటుంబ సభ్యులను సన్మానించారు. వైస్ చైర్మెన్‌గా తిరుపతి రెడ్డి, డైరెక్టర్లుగా నరేష్ గౌడ్, కిషన్ రాథోడ్, వంశీ రాజ్, సుజాత, జాఫర్, శేఖర్, అశోక్, అఖిల్ హహ్మద్,అమ్జద్ మియా, మల్లారెడ్డి, నర్సింహులు,శంకరప్ప పాటిల్, తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు రాములు యాదవ్, మహమ్మద్ మక్సుద్, నరసింహారెడ్డి, నాయకులు జేజే జావీద్ మహమ్మద్ ముజాహిద్ ముల్తాని పటేల్ మహమ్మద్ సమీర్ మహమ్మద్ సత్తార్ మురళీకృష్ణ గౌడ్ కల్వ శేఖర్ అనిల్ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఐడీఏకాలనీకి చెందిన రాము యాదవ్, కుమారి దంపతుల కుమారుడు నగేష్ యాదవ్ వివాహ రిసెప్షన్ వేడుకలో మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కొలను రవిందర్‌రెడ్డి పాల్గొని.. నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య గౌడ్, మోహన్ గుప్త,ధన రాజు, రాజేంద్ర ప్రసాద్,దీనానాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలనా పునాదులను గుర్తెరగాలి

• గీతం ఆతిథ్య ఉపన్యాసంలో ప్రొఫెసర్ మెఖేల్ సి.విలియమ్స్

నవతెలంగాణ-పటాన్‌చెరు



మనల్ని మనం ఎలా పరిపాలించుకోవాలనేది అందరికీ తెలిసుండాలని, పాలనా పునాదులను గుర్తెరగాలని ప్రొఫెసర్ మెఖేల్ సి.విలియమ్స్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీహెచ్ఎస్)లోని పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ది జ్యామెట్రీ ఆఫ్ జస్టిస్: యాన్ ఒడస్సీ ఇన్ ఫ్రాక్టల్ పాలిటిక్స్' అనే అంశంపై సోమవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు. కొలరాడో (అమెరికా)లోని డెన్వరికీ చెందిన మెఖేల్ రచయిత, వ్యవస్థాపకుడు, న్యాయవాది, పెట్టుబడిదారు, పరోపకారిగా పేరొందారు. పాలన, రాజకీయ నిర్మాణాలపై తన దృక్కోణాలను గీతం విద్యార్థులతో పంచుకున్నారు. డాక్టర్ విలయమ్స్ ప్రసంగం కేవలం విద్యాపరంగానే కాక, సాంప్రదాయిక వివేకాన్ని సవాలు చేయడం, పాలనా నిర్మాణాల యొక్క క్లిష్టమైన పునఃమూల్యాంకాన్ని ప్రేరేపించేలా సాగింది. తద్వారా సంభావ్య ప్రభావం ప్రజాస్వామ్య వ్యవస్థలపై మన అవగాహనను పునర్నిర్మించడమే గాక మరింత న్యాయమైన, సమానమైన, సమతుల్య రాజకీయ సంస్థల వైపు స్పష్టమైన మార్గాలను అందించింది. ఆధునిక, పురాతన అధికారాల విభజనపై డాక్టర్ విలియమ్స్ దృష్టి సారిస్తూ, ఆధునిక కాలంలో కార్యనిర్వాహక, శాసన, న్యాయపరమైన అధికారాల త్రయాన్ని నొక్కి చెప్పారు. అయితే రాచరికం, కులీనత, ప్రజాస్వామ్యం అనే పాత త్రైపాక్షిక విభజనతో ఆయన విభేదించారు. ప్రజాస్వామ్యం, శాసనం, సమాఖ్య అంశాలకు అనుగుణంగా కార్యనిర్వాహక, శాసన, ప్రజాస్వామ్యం, రాచరికం, న్యాయవ్యవస్థ, కులీనత అంశాలతో కూడిన 'క్యూబిక్' రాజ్యాంగం భావన చుట్టూ ఆయన చర్చ సాగింది .విలియమ్స్ తన ప్రభావవంతమైన పుస్తకం 'అమెరికా ఆన్ ట్రయల్' నుంచి ఒక సంచలనాత్మక దృక్పథాన్ని అందించారు. రాజకీయ సంస్థ కోసం కొత్త సైద్ధాంతిక ఫ్రేమ్ వర్క్ ను రూపొందించడమే గాక, అది పాలనా విధానాన్ని విప్లవాత్మకంగా మార్చగలదని ఆయన విశ్వసించారు. కార్యనిర్వాహక, శాసన, న్యాయ, రాచరికం, కులీనత, ప్రజాస్వామ్యం, సమాఖ్య, రాష్ట్ర, స్థానిక అంశాలను పాలనకు ప్రాథమికమైనవని ప్రొఫెసర్ విలియమ్స్ నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. జీ హెచ్ఎంఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సన్నీ గోస్మాన్ జోస్ అతిథిని సత్కరించారు. రాజనీతి శాస్త్ర విభాగం సమన్వయకర్త డాక్టర్ మయాంక్ మిశ్రా అతిథిని స్వాగతించి, విద్యార్థులకు పరిచయం చేయగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ గుర్రం వందన సమర్పణతో ఈ ఆతిథ్య ఉపన్యాసం ముగిసింది. ఈ చర్చ ఒక ప్రత్యేకమైన, భిన్న దృక్కోణం నుంచి రాజకీయ నిర్మాణాలను ఆలోచింపజేసేదిగా కొనసాగింది.

దళిత డిప్యూటీ సీఎం పట్ల కులవివక్షపై..

సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి

- అగ్రకులదురహంకారానికి ఈ వివక్షే నిదర్శనం
- టెంపుల్ ఈవో పై చర్యలు తీసుకోవాలి
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్, సంగారెడ్డి





యాదాద్రి గుట్టపై బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ప్రభుత్వం తరఫున వెళ్లిన దళిత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను నేలపై కూర్చోబెట్టి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర మంత్రులు వారి సతీమణుల సైతం కుర్చీల్లో కూర్చుని కులవివక్షత పాటించారని.. దీనిపై వెంటనే సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధర్యంలో మహనీయుల విగ్రహాల వద్ద సోమవారం నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్‌లో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్, సంగారెడ్డిలో కేవీపీఎస్ జిల్లా పి.అశోక్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.దుర్గాప్రసాద్‌లు మాట్లాడు తూ.. ఈ దుర్మార్గమైన అమానుష సంఘటనను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలన్నారు. ఒకవేళ ఈ క్రతువులు వారి కుటుంబ సొంత వ్యవహారమే అయితే మరి అక్కడ ఉప ముఖ్యమంత్రి ఎందుకు ఉన్నాడని.. ఆయన అందరితో సమానంగా కాకుండా కింద ఎందుకు కూర్చున్నాడు అని ప్రశ్నించారు. బ్రాహ్మణ కుట్రల ప్రకారం, భట్టి హిందువే ఐనా, నిచ్చెనమెట్ల కుల వ్యవస్థలో అతడు దళితుడు పంచముడు కాబట్టే అలా తక్కువ స్థాయిలో నేలపై కూర్చోబెట్టారా అనే దానికి సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఇది కాంగ్రెస్ మార్పు రాజకీయమా? వివరణ ఇవ్వాలన్నారు. యాదాద్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమం నిర్వహించి.. డిప్యూటీ సీఎంను అవమానించడం, ప్రోటోకాల్ పాటించకపోవడం సరికాదన్నారు. టెంపుల్ ఈవోపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఖేడ్‌లో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, షెడ్యూల్ క్యాస్ట్ సేవక్ సమాజ్ అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు అంజయ్య, కేవీపీఎస్ నాయకులు హరిపాల్, చంద్రయ్య, అరుణ్, సంగారెడ్డిలో కేవీపీఎస్, సామాజిక సంఘాల నాయకులు ప్రవీణ్, దత్తు, పవన్, బస్వరాజ్, బాలరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు రంజాన్ పండుగ సరుకులు పంపిణీ

నవతెలంగాణ సదాశివపేట

పట్టణంలోని గౌడ ఫంక్షన్ హాల్‌లో సదాశివపేట పట్టణ గీతా పారిశ్రామిక సహకార సంఘం నెంబర్ వన్ సొసైటీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ గౌడ్ సోమవారం 100 మంది ముస్లిం మహిళలకు రంజాన్ పండుగ సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లిదండ్రులు మాజీ మున్సిపల్ చైర్మెన్ సిహెచ్ నరసింహ గౌడ్, శమంతల జ్ఞాపకార్థం గత మూడేండ్ల నుంచి రంజాన్ సందర్భంగా మహిళలకు సరుకులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నల్ల జయరామ్ గౌడ్, అవసలి నర్సింగ్ రావు, మామిడి రాజు, సేడిది వినోద్, భూపాల్ గౌడ్, శంకర్ గౌడ్, నల్ల వెంకటేశం గౌడ్, రాజమౌళి గౌడ్, ఈశ్వర్ గౌడ్, వసీం తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం పర్సంటేజీలు అడుగుతున్నారు..



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని నేరేడుగుంటలో మన ఊరు మనబడి పథకంలో భాగంగా తాను పనులు చేపట్టానని.. అయితే గ్రామస్థాయి అధికారి పర్సంటేజ్ ఇస్తేనే డబ్బులు డ్రా చేసి ఇస్తానని అంటున్నాడని.. ఇదెక్కడి పరిస్థితి అని ఎంపీటీసీ కృష్ణ గౌడ్ మండల సభ దృష్టికి తీసుకువచ్చారు. సోమవారం అందోల్ మండల సర్వసభ సమావేశాన్ని ఎంపీపీ జోగు బాలయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం షాపులు కొనసాగిస్తున్నారని జెడ్పీటీసీ రమేష్ ఆరోపించారు. మన ఊరు-మన బడి కింద రూ.75 లక్షల వరకు పనులను చేపడితే, బిల్లులు రావడం లేదని బిల్లులు వచ్చేలా చూడాలన్నారు. వ్యవసాయ భూములను నాలా కన్వర్షన్ చేయకుండా గ్రామాలలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అధికారులు ఏం చేస్తున్నారని ఎంపీవో సౌజన్య ను ప్రశ్నించారు. పోసానిపేట, సంగుపేట, అల్మాయిపేట, తాడ్మాన్నూర్, డాకూర్ గ్రామాలలో నీటి ఎద్దడి ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, నీటి సమస్య తలేత్త కుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మి ప్రసాద్ తెలిపారు. అక్సాన్‌పల్లి, తాడ్మన్నూర్, డాకూర్ గ్రామాలకు నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు నిధులు మంజూరయ్యాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు. నేరడిగుంటకు ఆర్‌టీసీ బస్సు సర్వీస్‌ను పునఃరుద్దరించాలని సభ్యులు జోగిపేట బస్టాండ్ కంట్రోలర్ ఫక్రొద్దీన్ ను కొరారు. కాలువల ద్వారా చెరువుల్లోకి వచ్చే సింగూరు నీరు అక్కడక్కడ పంట పోలాల్లోకి వచ్చి చేరుతుందని, పంట నష్టం జరగకుండా ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌ను ఎంపీపీ బాలయ్య ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేష్, తహశీల్దార్ భాస్కర్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ మధుకర్‌రెడ్డి, ఏడీఏ అరుణ, ఏవో విజయరత్న, ఎంఈవో కష్ణ, ఎంపీటీసీలు చిన్న జనార్ధన్, నందిని నర్సింలు, ఉమారాణి జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నారంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లో పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేడు(మంగళవారం) పర్యటించి పలు గ్రామాల్లో కల్వర్టు పనులకు భూమిపూజ కార్యక్రమం చేపట్టనున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, రాష్ట్ర నేత వెంకటేశం గౌడ్, పలువురు ప్రజా ప్రతినిధులు ఎంపీటీసీలు నాయకులు పాల్గొంటారన్నారు.

మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు యువ న్యాయవాది లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని గంటల తగ్గింపు, ఓటు హక్కు, పని ప్రదేశంలో సౌకర్యాల కల్పన, పురుషులతో సమానంగా వేతనం కోసం నాడు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట యోధురాలు క్లారా జేటికిన్ స్ఫూర్తితో.. నేడు బీజేపీ పాలనలో మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకురాలు శారదా అధ్యక్షతన సంగారెడ్డిలో సోమవారం నిర్వహించిన సభకు వారు హాజరై మాట్లాడారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలను అన్ని మతాలు ద్వితీయ శ్రేణి పౌరురాలుగా అణిచివేశాయన్నారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి, అయోధ్య రామాలయం ప్రారంభోత్సవానికి పిలవకుండా అవమానించడం దేశం కండ్లారా చూసిందన్నారు. 1911 మార్చి 8న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో వేలాదిమంది మహిళలు వీరోచితంగా పోరాడి కాల్చివేతకు గురయ్యారన్నారు. వారి పోరాట తెగువతో ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయన్నారు. ఆ వెలుగులోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏర్పడిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహిళ ఓట్ల కోసం చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ బిల్ తెచ్చారని మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ ఎందుకు బిల్ పాస్ చేయలేదని విమర్శించారు. సావిత్రి బాయిఫూలే, రామబాయి అంబేద్కర్, వీర నారీమణులు ఐలమ్మ మల్లు స్వరాజ్యం వంటి వీర వనితల స్ఫూర్తితో ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి. అశోక్, హైకోర్టు న్యాయవాది చందు మార్షల్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, సామాజిక ఉద్యమ నాయకులు బస్వరాజ్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు అరుంధతి, అరుణ, గాలోరి తదితరుల పాల్గొన్నారు.

ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణికి 100 అర్జీలు అందాయన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాదులను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలు

నవతెలంగాణ-ఝరాసంగం



వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. మండల పరిధిలోని కొల్లూరు చౌరస్తా వద్ద గ్రామ యువకులు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటేశం, మాజీ అధ్యక్షుడు రాచయ్య స్వామి, మాజీ మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు జగదీశ్వర్,నాయకులు విజేందర్ రెడ్డి, సంతోష్ పాటిల్, రాజు, శివరాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వే నెంబర్ 229, 284లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. తహసీల్దార్ బిక్షపతి, రెవెనూ ఇన్‌స్పెక్టర్ జయ ప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను సోమవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బిక్షపతి మాట్లాడుతూ ..ప్రభుత్వం స్థలాలను కబ్జాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాలలో మహిళ దినోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నేడు మహిళలు సైన్స్ అండ్ టెక్నాలజీలో, అంతరిక్షం, సాయుధ దళాలు, రాజకీయ రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం వల్లి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, శ్వేత ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థినిల ఆటపాటలతో అలరించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవిందంర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 18వ నుంచి పరీక్షలు జరగనున్నాయని.. బాగా చదివి శతశాతం ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం తన సొంత నిధులతో కొనుగోలు చేసిన పరీక్షలకు కావల్సిన మెటీరియల్ విద్యార్థులకు అందజేశారు. 10వ తరగతి పరీక్షలు ఒక పునాది లాంటివని.. ఈ మార్కులు చాలా ముఖ్యమ న్నారు. కాబట్టి అందరు బాగా చదువుకొని లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ శ్రీతిన్‌రెడ్డి, కొలన్ రితిన్ రెడ్డి, బొల్లారం మునిసిపల్ కౌన్సిల్లర్లు వేణుపాల్ రెడ్డి ,జైపాల్ రెడ్డి, రత్నం, బీరప్ప, పుండరికం, ప్రభు, సాయి కిరణ్ రెడ్డి, యాదయ్యగౌడ్, శారద, శ్రీనివాస్ రాజు, యువత అల్తాఫ్, జాషువా పాల్గొన్నారు.



దాహార్తిలో బీసీ కాలనీ..

బోర్లు వేసి సమస్య పరిష్కరించాలి

2వ వార్డు కౌన్సిలర్ గోపాలమ్మ వెంకటయ్య

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బీసీ కాలనీలోని బోర్లల్లో నీళ్ల రావడం లేదని.. కాబట్టి నూతన బోర్లు వేసి బీసీ కాలనీవాసుల దాహార్తిని తీర్చాలని రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో... బీసీ కాలనీలోని బోర్లు అన్నీ ఎండిపోయాయన్నారు. దాంతో నీరు లేక ఈ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారన్నారు. పైగా ఇక్కడికి మంజీరా నీరు ఎలాగూ రావడం లేద న్నారు. కాబట్టి బోర్లు వేసి ఈ కాలనీవాసుల దాహార్తిని తీర్చాలని కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా బోర్లు వేసి వుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని.. మున్సిపల్ కమిషనర్‌కి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్లు వేయించాలని లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-రాయికోడ్



మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామ శివారులో గల మొటికే ఆనంద్ వ్యవసాయ పొలంలో సోమవారం రోజున కుళ్లిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ వెంకటేరెడ్డి తెలిపారు. మృతుని వయస్సు అందాద 55 నుండి 65 వరకు ఉంటుందన్నారు. శరీరంపై తెలుపు రంగు షర్టు, ధోతి ధరించి ఉన్నాడ న్నారు. బట్టతల, తెల్ల వెంట్రుకలు, గడ్డం ఉన్నదన్నారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసు నమోదు అయి ఉంటే.. లేదా ఎవరైనా శవాన్ని గుర్తుపడితే 8712656770, 8712656732 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు మునిపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-మునిపల్లి

అధిక సాంద్రతా పత్తి సాగుపై మండల కేంద్రమైన మునిపల్లి రైతు వేదికలో నేడు(మంగళవారం) రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు మునిపల్లి ఏఈఓ సంగీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం10గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంగుపేట డాట్ సెంటర్‌కు సంబంధించి సైంటిస్టులు హాజరై రైతులకు పలు సూచనలు, సలహాలు చేస్తారన్నారు. రైతులు విధిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఈత చెట్ల పెంపకానికి ఉచిత కరెంటు ఇవ్వాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఈత చెట్ల పెంపకానికి ఉచిత కరెంటు ఇవ్వాలని, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్ మాట్లాడుతూ.. హత్నూర మండలం బోరపట్ల కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం సొసైటీకి ప్రభుత్వం మూడెకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేసిందని.. అందులో హరితహారంలో ఈత, తాటి చెట్లు నాటినట్టు చెప్పారు. వాటి పెంపకం కోసం బోరు వేయడంతో విద్యుత్ అధికారులకు కరెంటు కోసం దరఖాస్తు చేస్తే.. కమర్షియల్ మీటర్‌ను ఇచ్చారన్నారు. దాంతో ప్రతి నెల రూ.10, 12వేల కరెంటు బిల్లు వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈత చెట్లు పెరిగి కల్లు గీయాలంటే సుమారు నాలుగు ఐదేండ్లు పడుతుందని.. అప్పటికి వేల రూపాయల కరెంటు బిల్లు ఎక్కడి నుంచి కట్టాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న ఉచిత విద్యుత్, ఈత చెట్ల పెంపకానికి ఇవ్వాలని కోరితే విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంతో ఇబ్బందులు పెడుతున్నారని మండి పడ్డారు. వెంటనే వారిపై చర్యలు తీసుకొని, కమర్షియల్ మీటర్‌ను తొలగించి ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోరపట్ల సొసైటీ ఉపాధ్యక్షులు అంజయ్య గౌడ్, చెన్న గౌడ్, అంజన్నగౌడ్, నర్సింలు గౌడ్, సత్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటకాజా దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-వట్‌పల్లి



మండల కేంద్రమైన వట్‌పల్లిలో ఈనెల 9 నుంచి ప్రారంభమైన శ్రీశ్రీశ్రీ వెంకట్ కాజా 39వ ఆరాధన ఉరుసు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడోరోజైన సోమవారం అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, సంగారెడ్డి జిల్లా చైర్‌పర్సన్ మంజు శ్రీ భర్త జైపాల్ రెడ్డిలు దర్గాను దర్శించుకున్నారు. భక్తుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ నిర్వహకులతో కలిసి భోజనాలు చేశారు. ఆలయ ప్రాంగణం దగ్గర ఏర్పాటుచేసిన దుకాణ సముదాయ వ్యాపారస్తులను పలుకరిస్తూ కాసేపే మాట్లాడారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అశోక్ గౌడ్, తాజా మాజీ సర్పంచులు, మహమ్మద్ ఖాయం పాషా తదితరులన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

నవతెలంగాణ-కొండాపూర్



ప్రతీ మూడు నెలలకొకసారి ప్రజల మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మొదలైన అంశాలపై నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సోమవారం నామమాత్రంగా సాగింది. మండల కేంద్రంలో ఎంపీపీ మనోజ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి పలువురు అధికారులు డుమ్మా కొట్టారు. కాగా సమావేశంలో ముందుగా తాగునీరు, విద్యుత్, ఉపాధి హామీ, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మొదలైన అంశాలపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల సమాచారాన్ని చదివి వినిపించారు. గత సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నేటికీ పరిష్కరించకపోవడంపై ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దానిపై ఎంపీపీ మనోజ్ రెడ్డి స్పందిస్తూ.. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడకుండా వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వేసవిలో నీటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. ఎంపీటీసీ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. గత సర్వ సభ్య సమావేశాలు నుంచి అధికారులకు సమస్యలు తమ ముందు పెట్టిన ఇప్పటివరకు పరిష్కరించలేదని అధికారులపై మండిపడ్డారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడమే కాకుండా, ముఖ్యంగా వైద్య రంగానికి సంబంధించిన డాక్టర్ అంజుమ్ రేష్మ సమయ వేల పాటించడం లేదని, తమ ఇష్టానుసారంగా ఉద్యోగానికి వస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా కింది స్థాయి డ్యూటీ డాక్టర్లతో ప్రజలకు వైద్యం అందిస్తున్నారని మండిపడ్డారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ పోలీస్ డిపార్ట్మెంట్ ఎస్సై సతీష్ మాట్లాడుతూ.. గత మూడు నెలల్లో 2.50 కోట్లు(రెండున్నర కోట్లు) మద్యం విక్రయించడం జరిగిందన్నారు. విద్యుత్ మండల ఏఈ మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకం కింద 9000 ఆన్లైన్ అప్లికేషన్ చేయగా.. 6356 సర్వీస్ కనెక్షన్లు మాత్రమే గృహజ్యోతి పథకానికి ఆన్లైన్ చేయడం జరిగిందన్నారు. జీరో బిల్ రానివారు ఎంపీడీవో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, జడ్పీటీసీ పద్మావతి పాండురంగం, ఎంపీపీ లక్ష్మీ రాంచందర్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తాసిల్దార్ అనిత, ఎంపీటీసీలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన నిజాంపేట్ గ్రామ పంచాయతీకి పరిధిలో జరుగు తున్న ఉపాధి హామీ పనులను సంగా రెడ్డి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.జ్యోతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కూలీలకు పని పరిమాణాన్ని బట్టి డబ్బులు వస్తాయ న్నారు. ఉపాధి హామీ పనికి వచ్చేవారు ఉదయం 7 గంటలకే హాజరై మధ్యాహ్నం 12:00 వరకు పని చేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలకు టెంటు, నీళ్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్టు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం సాంకేతిక సహాయకులకు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లకు కొలతల గురించి కూలీలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మాణిక్ రావు, మాజీ సర్పంచ్ జగదీశ్వరచారీ, ఉపసర్పంచ్ రాంచందర్ రావు, టిఏ ప్రహ్లాద్, ఏపీఏ నరేందర్, కూలీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సదాశివపేట



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు విడుదల కోసం జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడతానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు గత 6,7 నెలల నుంచి వేతనాలు బకాయి ఉన్నాయని.. దాంతో కార్మికులకు కుటుంబ పోషణ భారంగా మారుతున్నదన్నారు. ఎన్నికల కోడ్‌తో వేతనాలు నిలిపిన ప్రభుత్వం.. కోడ్ అయిపోయి మూడు నెలలవుతున్నా నేటికీ వేతనాలు వేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వం వేత నాలు విడుదల చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని.. కార్మికుల ందరినీ ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో తీవ్రమైన కృషి చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహారించడం తగదన్నారు.వారికి ఈఎస్ఐ, పీఎఫ్ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు శేఖర్, సంజీవులు, రామచందర్, పోచయ్య, సాయిలు, మైపాల్, చంద్రయ్య, అశోక్, వెంకయ్య కిషన్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ సర్వేకు సపరేటుగా పారితోషికం ఇవ్వాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ఆశా వర్కర్లతో పనులు చేయించుకుని అలవెన్సు చెల్లించకపోవడం హేయమైన చర్య అని.. ఆశాలు చేపట్టిన లెప్రసీ సర్వేకు సపరేటుగా పారితోషకం ఇవ్వాలని యూనియన్ నాయకులు ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక డిప్యూటీ డీఎం అండ్‌హెచ్ఓ శంకర్ నాయక్‌కు మొమోరాండం అందజేశారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లతో నిత్యం అనేక రకాల పనులు చేయిస్తుండడమే కాకుండా.. లెప్రసి సర్వేను కూడా ఎలాంటి పారితోషకం ఇవ్వకుండా చేయిస్తున్నదన్నారు. ఈసారి కూడా సర్వే చేయించుకుంటూ.. గతంలో నిర్వహించిన సర్వేలకు కూడా డబ్బులు చెల్లిస్తామని చెల్లించలేదన్నారు. గతంలో చేసిన వాటికి చెల్లించిన అనంతరమే మళ్లీ సర్వే చేయించాలన్నారు. ఓపక్క వేతనాలు పెంచకుండా.. మరోపక్క చేసిన పనికి కూడా జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈసారి నిర్వహించే లెప్రసీ సర్వేకైనా తక్షణమే డబ్బులు చెల్లించాలన్నారు. లేనియెడల సర్వే నిర్వహించేది లేదని వినతిపత్రంలో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమల, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎంల భద్రతకు చర్యలు తీసుకోవాలి



●కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-మెదక్

రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈవిఎంల భద్రత, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదిత భవనాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. సోమవారం మెదక్ నియోజకవర్గానికి సంబంధించి మెదక్ జూనియర్ కళాశాలను పరిశీలించి, ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రతకు గదులు, భద్రత దృష్ట్యా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాలేజీలకు సెలవులు ఇచ్చిన అనంతరం డిస్ట్రిబ్యూషన్ రిషిప్షన్ కేంద్ర ఏర్పాట్ల పనులు మొదలు పెట్టాలని, ఈవీఎంలు భద్రపరచుటకు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్, అదనపు ఈవీఎంలతో సహా భద్రపరచడానికి సరియైన హాల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈవీఎం కమీషనింగ్‌కి అనువైన హాల్‌ను ఏర్పాటు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ శ్రీనివాసరావు, సంబంధిత ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

మెదక్

3

మంగళవారం | 12 మార్చి 2024 | www.navatelangana.com

దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ రావు



నవతెలంగాణ-పాపన్నపేట

జాతర ముగిసింది. మూడు రోజుల పాటు జాతరలో గడిపిన భక్తులు దుర్గమ్మా వెళ్ళొస్తామమ్మా అంటూ తమ ఇళ్లకు మళ్ళారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు సోమవారం దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు చైర్మన్ బాలాగౌడ్, ఇఓ మోహన్ రెడ్డి ఆలయ సిబ్బంది. ధర్మకర్తలు. పూజారులు స్వాగతం పలికారు. ఈయన వెంట కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్, కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు గోవింద్, ప్రశాంత్ రెడ్డి, సుప్రబాగ్రావు, గంగా సరేందర్. నర్సింలుగుప్తలు ఉన్నారు. పాలక వర్గ సభ్యులు, జిల్లా స్థాయి అధికారుల సమన్వయం వల్ల జాతర ప్రశాంతంగా జరిగింది. జాతరలో 50కి పైగా పిల్లలు తప్పిపోగా పోలీసులు వారిని వారి తల్లితండ్రులకు అప్పజెప్పారు. జాతరలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 5 బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేశారు.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

●అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి
●ప్రజావాణికి 100 అర్జీలు
●కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

ప్రజావాణికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 100 అర్జీలు వచ్చాయి. ఆయా దరఖాస్తులను అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేష్‌లతో కలిసి కలెక్టర్ రాహుల్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్‌తో పాటు హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఇప్పటి వరకు ఇంకా ఎన్ని అర్జీలు పెండింగ్ ఉన్నాయని, వాటికి సరైన కారణాలు తెలుపుతూ నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మెదక్ జిల్లాలో ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన 250 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన అర్జిదారులు మళ్లీ పదేపదే అదే సమస్యపై పరిష్కారం కాలేదని రాకూడదని తెలిపారు. అర్హతను బట్టి వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సమస్య పూర్వపరాలను వివరించాలన్నారు. అప్పుడే ప్రజావాణిపై ప్రజలకు ఒక నమ్మకం ఏర్పడుతుందన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ పిడి శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, మైన్స్ జయరాజ్, ఏడి అగ్రికల్చర్ గోవింద్, జిఎం ఇండస్ట్రీస్ కృష్ణమూర్తి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, యువజన క్రీడల అధికారి నాగరాజు, సివిల్ సప్లై అధికారి బ్రహ్మారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేసిన గ్రేస్ ఫౌండేషన్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ మునుముందు గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అకుల్ కొలనూరు, పాస్టర్స్ సురేష్, దేవదాస్, పాల్ ,లక్ష్మణ్ పాల్, సభ్యులు సాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం రమణీయం స్వామి వారి కళ్యాణం

హాజరైన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

శ్రీ సిద్ధ రామేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయం రమణీయం స్వామి వారి కళ్యాణం అని భక్తులు పులకించారు స్వామి వారి కళ్యాణానికి మైనంపల్లి హనుమంతరావు దంపతులు ముఖ్య అతిథిగా సోమవారం హాజరయ్యారు. మండల పరిది లోని ముత్తయి కోట గ్రామంలో జరిగిన స్వామివారి కల్యాణ మహోత్సవంలో మైనంపల్లి హనుమంతరావు దంపతులు పాల్గొని స్వామివారి కల్యాణం నిర్వహించారు. శ్రీ సిద్ధి రామేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు మహాశివరాత్రి వేడుకలకు భక్తులకు అలయ సిబ్బంది అసౌకర్యాలు కలవకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అక్బర్, పరశురాం గౌడ్ మంజుల సిద్ధగిరి గౌడ్, మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, జీవన్ రావు, బొజ్జ పవన్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ శంకర్, లెంక రాజు, గడ్డం మహేష్ , బాల పోచయ్య, చిన్న సాయిలు, లంబాడి సుభాష్,పాల్గొన్నారు.

ఏడుపాయలజాతర హుండీ ఆదాయం రూ.61.18లక్షలు



నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల జాతర ఉత్సవాల 14 రోజుల ఆదాయం రూ.61 .18 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ బాల గౌడ్ ఈవో మోహన్ రెడ్డి వెల్లడించారు. సోమవారం జాతర హుండీ లెక్కింపు కార్యక్రమం రాజరాజేశ్వరి సేవా సమితి అధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో నిర్వహించగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్స్పెక్టర్ రంగారావుల పర్యవేక్షణలో లెక్కింపు కొనసాగింది. బంగారు, వెండి వస్తువుల మినహా హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.24.75 లక్షలు రాగా, ప్రసాద విక్రయాల ద్వారా రూ.25 లక్షల పైచీలుకు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.9.95 లక్షలు, కేశఖండనం ద్వారా రూ.59వేలు, ఓడి బియ్యం ద్వారా రూ.77వేలు రాగ వివిధ విక్రయాలు, ప్రత్యేక దర్శనం , కేశాఖండనం , ప్రసాద విక్రయాలు, ద్వారా రూ.36.42 లక్షల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నారి శక్తి ఫిట్నెస్ రన్నింగ్ పోటీలు

గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రధానం
ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి



నవ తెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినిలకు నారీ శక్తి ఫిట్నెస్ రన్నింగ్ పోటీలను నిర్వహినంచారు. సోమవారం పాఠశాల విద్యార్థులతో రన్నింగ్ లాంగ్ జంప్ క్రీడలను ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి పాఠశాల పిడి కమల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వరలక్ష్మి మాట్లాడారు నారి యువశక్తి ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. 6 తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులు మానసికంగా శరీరకంగా అభివృద్ధి చెందాలంటే ఆటల పోటీలు ఎంతో అవసరమన్నారు. ఎదిగే ఆడపిల్లలు రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. అందుకు ప్రతి బాలిక పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాఠశాలలో అందించే పల్లి పట్టిలు కానీ ఇతరత్రా అదనపు ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల సిబ్బంది అంగన్వాడి టీచర్లు దేవలత లక్ష్మి గౌసియా మంగేశ్వరి నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాలి

● ఎన్నికల బాండ్ల వివరాలు ఎలక్షన్ కమిషన్‌కి వెంటనే ఇవ్వాలి
● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కె.మల్లేషం, కే.నర్సమ్మ



నవతెలంగాణ-మెదక్

సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బీఐ పాటించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.మల్లేషం కే.నర్సమ్మలు డిమాండ్ చేశారు. మోదీ అనుకూల ఎస్బిఐ వైఖరిని నిరసిస్తూ వెంటనే ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ పొలిటి బ్యూరో ఇచ్చిన పిలుపుమేరకు మెదక్ ఎస్బిఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పునిచ్చిందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని మూడు వారాల్లోగా మార్చి 6లోపు ఎలక్షన్ కమిషన్‌కు ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్చి 13న ఆట్టి వివరాలు బహిర్గతం చేయాలని గడువు విధించిందని తెలిపారు. బిజెపికి అనుకూలంగా ఎస్బిఐ కావాలని సమాచారం ఇవ్వడానికి మూడు నెలలు గడువు పడుతుందని సుప్రీంకోర్టును కోరిందంటే ఎన్నికల ముందు ఏ పార్టీకి ఎన్ని విరాళాలు వెళ్లాయో తెలిస్తే బిజెపికి నష్టం జరుగుతుందని భావించి జూన్ 30 వరకు గడువు ఇవ్వాలని కోరిందన్నారు. అప్పటికి సార్వత్రిక ఎన్నికలు ముగుస్తాయి కాబట్టి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఎస్బిఐ వైఖరినీ బట్టి తెలుస్తుందన్నారు. ప్రధానమంత్రి ఆదేశాల మేరకే ఎస్బిఐ పూర్తిగా సహకరిస్తుందని, ప్రభుత్వ బ్యాంకులను పారదర్శకంగా నిర్వహించాల్సింది పోయి బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ రంగంలో అతిపెద్ద బ్యాంకు ఎస్బిఐ అని తన కార్యకలాపాలన్నీ డిజిటల్ పద్ధతిలో జరుగుతాయని సమాచారం కావాలంటే ఒక క్లిక్‌తో వస్తుందని ఇదంతా ప్రజలకు తెలుసని, కానీ న్యాయస్థానాన్ని ప్రజలను పచ్చి అబద్దాలతో ఎస్బిఐ మోసం చేస్తుందన్నారు. తాను విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలు సమర్పించేందుకు మీనవేషాలు లెక్కిస్తుందన్నారు. అందుకు సమయం పడుతుందని నమ్మించే ప్రయత్నం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గుతుందనేది స్పష్టం అవుతుందన్నారు.

ఎన్నికల బాండ్లను ఎవరు కొనుగోలు చేశారు, ఏ రాజకీయ పార్టీకి దానిని విరాళంగా అందజేశారనే విషయాలు తెలుసుకోవాలని దేశం యావత్తు ఎదురుచూస్తోందన్నారు. 2019 నుంచి 22,217 బాండ్లను ఎస్బిఐ జారీ చేసిందని, కొన్ని బాండ్లను రాజకీయ పార్టీలు నగదు రూపంలోకి మార్చుకున్నాయని, బిజెపికి సుమారు 7000 కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయని, ఇది పూర్తిగా క్విడ్ ప్రోకోగా ఉందన్నారు. ఎన్నికల బాండ్ల నిర్వాహనకు ఐటీ సిస్టంను అభివృద్ధి చేయడానికి ఎస్బిఐ సుమారు 60 లక్షలు ఖర్చు చేసిందని, దాని నిర్వహణ కోసం మరో 89 లక్షలు ఖర్చు చేసిందన్నారు. అలాంటి డిజిటల్ టెక్నాలజీని వాడుకోకుండా మీన వేషాలు లెక్కిస్తుందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు సక్రమంగా పనిచేసినప్పుడే అన్ని వ్యవస్థలు సరిగా ఉంటాయన్నారు. ఎస్బిఐ చైర్మన్‌ను సస్పెండ్ చేసి, అరెస్టు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలు వెంటనే భారత ఎన్నికల కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బస్వరాజు, జిల్లా కమిటీ సభ్యులు కె.గీత నాయకులు అజయ్, దాసు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించకపోతే చర్యలు తప్పవు

● గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండాలి
● గిరిజన ఎంపీపీకి అవమానం
● ప్రభుత్వ పథకాలు ప్రోటోకాల్ ప్రకారమే జరగాలి
● ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కౌడిపల్లి

అధికారులు ప్రోటోకాల్ పాటించకపోతే చర్యలు తప్పవని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంపీపీ రాజు నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సర్పంచులు గ్రామాల్లో లేకపోవడంతో స్పెషల్ అధికారులు గ్రామాలలో అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఆమె అన్నారు. గత సాధారణ సర్వసభ సమావేశంలో తీర్మానాలు చేసినా ఈ సమావేశంలో కూడా పనులు అమలు కాకపోవడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 9 మంది స్పెషల్ ఆఫీసర్లు ఉండగా పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం కింద 33 పనులకు రూ.1.42 లక్షలు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా త్రాగునీరు రావడం లేదని ఆరోపణ చేయడం సరికాదన్నారు.



సాధారణ సర్వసభ సమావేశంలో మిషన్ భగీరథ అధికారులు ప్రతి గ్రామంలో త్రాగునీరు వస్తున్నాయని సభకు తెలిపారు. మహ్మద్ నగర్ ఎస్సీ వాడలో గత కొన్ని రోజులుగా త్రాగునీరు రావడంలేదని ఎంపీటీసీ సునీత కిషన్ నాయక్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మిషన్ భగీరథ నీరు వ్యవసాయానికి వాడుతున్నారని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ఎంపీపీ రాజు నాయక్ మాట్లాడుతూ స్పెషలాఫీసర్లు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పీఎస్‌సిని వెంకట్రావుపేట్‌కు మార్చాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంకట్రావుపేట గ్రామానికి మార్చాలని ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ ప్రతిపాదించగా, సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వెంకటరావుపేటకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మారిస్తే గిరిజనులు తాండా వాసులతో పాటు తుంకి నల్ల పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన చికిత్స అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, జెడ్పిటిసి కవిత అమర్ సింగ్, తహశీల్దార్ ఆంజనేయులు, మమ్మద్ నగర్ సొసైటీ చైర్మన్ బాన్సువాడ గోవర్ధన్ రెడ్డి జిల్లా కోఆప్షన్ నెంబర్ మన్సూర్, కో ఆప్షన్ నెంబర్ హైమద్ ఎంపీడీవో శ్రీనివాస్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు నిషేధం
● అధికారులు సమన్వయంతో పనిచేయాలి
● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్

పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో పదవ తరగతి పరీక్షలపై ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. జిల్లాలో మొత్తం 10,300 మంది విద్యార్థులు 68 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయానికంటే గంట ముందే చేరుకోవాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకురావద్దని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ మూడు బృందాలు పనిచేస్తాయన్నారు. ప్రతి సెంటర్‌కు రెండు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని, పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ బస్‌లను సమయానుకూలంగా నడిపించాలని, విద్యుత్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలు ఉండాలన్నారు. పటిష్ఠ పర్యవేక్షణ మధ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలి

జిల్లా తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు యాద గౌడ్



నవతెలంగాణ-చేగుంట/నార్సింగి

నీళ్లు లేక ఎండలకు పంటలు ఎండిపోతున్నాయని రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని మెదక్ జిల్లా తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు యాద గౌడ్ డిమాండ్ చేశారు. చేగుంట మండలంలోని అనంతసాగర్, రుక్మాపూర్ గ్రామాలతో పాటు నార్సింగి మండలంలో సోమవారం తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా కమిటీ సభ్యులు ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతు రక్షణ సమితి జిల్లా కమిటీ సభ్యులతో రైతులు తమ గోడను వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షులు యాద గౌడ్ మాట్లాడుతూ పంటలు ఎండి పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎండిపోయిన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు వేసిన పంటలు ఎండి పోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఇప్పటికే చాలా ఎకరాల పంట భూములు ఎండి పోయాయని మరిన్ని రోజుల్లో ఇంకా పంటలు ఎండిపోతాయని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పంటలను పరిశీలించిన వారిలో తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లాకమిటీ అధ్యక్షులు పత్రాల యాచాగౌడ్, గౌరవ అధ్యక్షులు మైసయ్య యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీశైలం, జిల్లా కార్యదర్శులు మామిడి నర్సారెడ్డి, చౌడు నరేందర్, ప్రచార కార్యదర్శి ఏ ఆశోక్ రెడ్డి, సహాయ కార్యదర్శి వజ్జ రాజు, పెద్ద తాండా తాజా మాజీ సర్పంచ్ క్షత్రియ నాయక్ తదితరులు ఉన్నారు.

ఏప్రిల్ 30 వరకు పెండింగ్ బియ్యం అప్పగించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మెదక్

జిల్లాలోని ఖరీఫ్, రబి సీజన్‌లో టెండర్ అయిన బియ్యాన్ని అప్పగించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్స్, సివిల్ సప్లై అధికారులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పౌరసరఫరాల శాఖ పనితీరు ఆదర్శనీయంగా ఉండాలన్నారు. జిల్లాలోని ఖరీఫ్ 2023-24 బియ్యం డెలివరి, రబి 2022-23 టెండర్ అయిన దాన్యం అప్పగించాలన్నారు. 2021-22 ఖరీఫ్, రబీ ధాన్యం బియ్యం అప్పగింతలు పెండింగ్ ఉన్న మిల్లర్లు ఏప్రిల్ 30 2024 వరకు డెలివరి పూర్తి చేయాలన్నారు. అప్పటికి పెండింగ్ ఉన్న మిల్లర్లపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించారు. 2022-23 ఖరీఫ్, రబీ ధాన్యం వెనువెంటనే అప్పగించాలని, టెండర్ పూర్తయిన ధాన్యాన్ని వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యం డెలివరిలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని, రోజువారి బియ్యం డెలివరిలపై సమీక్ష చేసి నివేదికలు అందజేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్‌లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లీస్ హరికృష్ణ, సహాయ పౌర సరఫరాల అధికారి అరవింద్ రెడ్డి, డిస్ట్రిక్ట్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రపాల్, డిప్యూటీ తహసిల్దార్ ప్రణీత రెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ డైరీ ఆవిష్కరణ

నవ తెలంగాణ-నర్సాపూర్ : తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ డైరీని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ సోమవారం ఆవిష్కరించారు. అదేవిధంగా తండాలోని మూతపడిన పాఠశాలలను పున ప్రారంభించాలని జిల్లా విద్యాధికారికి తెలంగాణ బంజారా సేవా సంఘ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి జి రామ్ చందర్, మనిరామ్, గౌరవ అధ్యక్షులు ప్రతాప్ సింగ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి చెన్న, శ్రీనివాస్, విఠల్, భీమ్లా, పీరూ సింగ్ ,శివరాం, రాజు, గణేష్‌లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నవ తెలంగాణ-కౌడిపల్లి

నూతనంగా నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్లకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సోమవారం కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ కింద ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని రోడ్లు నిర్మించుకుంటే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. స్పెషల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రజలంతా అధికారులకు సహకరించి ఎలాంటి తారతమ్యం లేకుండా కలిసికట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ బాలా గౌడ్, మాజీ సర్పంచ్ దివ్య మహిపాల్ రెడ్డి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, జిల్లా కోఆప్షన్ నెంబర్ మన్సూర్, కిషన్ నాయక్, పంచాయతీ శాఖ డిఈ అమరేష్, ఏఈ ప్రభాకర్, ఎంపీటీసీలు, నాయకులు తదితరులున్నారు.

బీరప్ప కళ్యాణ మహోత్సవానికి పోటెత్తిన భక్తజనం



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధిలో చేరిల గ్రామ శివారులో బీరప్ప జాతర ఉత్సవాల్లో భాగంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అక్క మహంకాళి కథ ఒగ్గు కళాకారులు చెప్పారు 12వ తేదీ వరకు వినూత్న రీతిలో అమ్మవార్లకు ఒడిబియాలు, బోనాలు, బండ్లు వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. ఒక్కొక్క రోజు ఒక్కొక్క దేవత వేషధారణలో కథలు చెప్పడం జరుగుతుందన్నారు సోమవారం బీరప్ప కళ్యాణం గావు రంగం బోనాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఏడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే బీరప్ప జాతరకు ఇతర మండలాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చి జాతరలో పాలుపంచుకున్నారు. బీరప్ప దేవునికి ఒడిబియాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. డోలు చప్పుల శివసత్తుల విన్యాసాల మధ్య బోనాలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాతర ఉత్సవ కమిటీ టెంట్లను, తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు.

ఉన్నత పాఠశాలలో "బేటి బచావో బేటీ పడావో"



నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి పట్టణ కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సిబ్బంది సమక్షంలో "బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి చిందం సబితా రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా మండల వైద్య అధికారి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి, వైద్య అధికారిలు మాట్లాడుతూ ఆడ పిల్లలను రక్షించాలని, ఆడ పిల్లలను చదివించాలని వివరించారు. ప్రభుత్వాలు, అధికారులు, నాయకులు అందరూ సమిష్టిగా ఆడపిల్ల ఎదుగుదల కొరకు కృషి చేయాలని కోరారు. "బేటీ బచావో - బేటీ పడావో" నినాదంతో బాలికల చదువు, సంక్షేమం కోసం భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలను వివరించారు. ఐసీడీఎస్ వారు బాలికల చదువు సంక్షేమం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు.

బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సాయం

నవ తెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని మాగ్దుంపూర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు ఎండి నజీరుద్దీన్ అనారోగ్యంతో మరణించగా ఈ విషయం తెలుసుకున్న శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతు సహాయంగా పదివేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ సోమ అశోక్‌లు ఉన్నారు.



రూ.23.10 లక్షలకు పలికిన తైబజార్ వేలం





నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపాలిటీకి 2024-25 సంవత్సరానికిగాను తైబజార్ వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో తైబజార్‌ను కోలా సందీప్ రూ.23.10 లక్షలకు దక్కించుకున్నాడు. పశువుల చిట్టిని చింతకుంట శ్రీకాంత్ రూ.1.55 లక్షలకు దక్కించుకున్నాడు. కసాయి వధశాలకు డిపాజిట్ రానందున వాయిదా వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ జైతురాం నాయక్ తెలిపారు. తిరిగి కసాయి వధశాలకు 13వ తేదీన వేలంపాట నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎర్ర గొల్ల లతా రమేష్ యాదవ్, సరిత ఆంజనేయులు గౌడ్, లలిత బిక్షపతి, మున్సిపల్ సిబ్బంది శ్రీరామ్ నాగేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలోని విద్యాబుద్ధులే భవిష్యత్తుకు పునాది

- క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలి
- మర్కుక్ ఎస్ఐ మధుకర్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

విద్యార్థి దశ నుండే క్రమ శిక్షణను అలవర్చుకోవాలని, బాల్యంలోని విద్యాబుద్ధులే భవిష్యత్తుకు పునాది అని మర్కుక్ చల్ల ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు గ్రామ తాజా మాజీ సర్పంచ్ భాస్కర్‌తో కలిసి పరీక్షల విధానం, తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థుల సత్ప్రవర్తనతో ఉండాలని, టీనేజ్ లో చెడు వ్యసనాలకు అలవాటు పడి, తప్పుడు మార్గంలో ప్రయాణిస్తే జీవితమంతా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తాజా మాజీ సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు రాసే విద్యార్థులు 10 జీపీఏ సాధించి బాసర ట్రిబుల్ ఐటీ లో సీట్లు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు భూజాత , వందన , ఉపాధ్యాయులు నరహరి ప్రసాద్ , శ్రీనివాసరావు, రమణారావు , విద్యాధర్ రెడ్డి, పద్మా రెడ్డి, నరహరి ప్రసాద్, సిద్దయ్య ,నాగేశ్వరరావు, సంతోష రజని, భ్రమరాంబ, కృష్ణ గారలు, సి ర్ పి నాయక్ గారు మరియు విద్యార్థిని విద్యార్థులు, తదితరున్నారు.

గట్ల మల్యాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం గట్ల మల్యాల ఉన్నత పాఠశాలలో 2002-2003 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయుల యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయలు రామక్రిష్ణారెడ్డి, రమేష్, రాంరెడ్డి, సింగాబట్టు రామరాజు,శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, పరమేశ్వర్ రెడ్డి, గంగా భవానీ, గోవిందా చారి, సుల్తానబేగం, సంతోష్ రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ద్యాగల రాజు, శ్రీకాంత్, తిప్పని మహేందర్, కమలాకర్, పర్శరాములు, నరేష్, భాస్కర్, శ్రీధర్, రాజేందర్, బాలక్రిష్ణ హాజరైనారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలి

- సిద్దిపేట ఎస్బిఐ ముందు సీపీఐ(ఎం) నిరసన







నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్/చేర్యాల/గజ్వేల్

ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బిఐ పాటించాలని, సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్బిఐ ఛైర్మెన్‌ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సిద్దిపేట ఎస్‌బిఐ బ్యాంకు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గి ఎన్నికలు అయ్యేదాకా ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెల్లడించకుండా దాచాలని ఎస్బిఐ చూస్తుందని అన్నారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెబుతూ ఆ బాండ్లకు సంబంధించిన వివరాలన్నింటిని మార్చి ఆరులోగా ఎన్నికల కమిషన్ కు అందజేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బిఐ విఫలమైందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బిఐ ఈ వైఖరి తీసుకోవచ్చని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలన్నింటినీ ఎస్బిఐ అందచేసేలా సుప్రీంకోర్టు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేట్ శక్తుల నుండి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వేలకోట్ల రూపాయలు నిధులు సమకూర్చుకొని బిజెపి ఎన్నికల్లో రాజకీయ అవినీతితో గెలవాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ నిరసనలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, జాలిగపు శిరీష, సిద్దిపేట రూరల్ మండల కార్యదర్శి మామిడాల కనకయ్య, సీపీఐ(ఎం) నాయకులు రెడ్డమైన అరవింద్, కొండం సంజీవ్, షారుక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో ఎస్‌బిఐ ఎదుట నిరసన

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న ఎస్బిఐ చైర్మన్ ను అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు.ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దిగజార్చే రీతిలో మోడీ ప్రభుత్వం దేశంలోని కార్పోరేట్ సంస్థల యజమానులతో కుమ్ముక్కై లక్షల కోట్ల ప్రజాధనాన్ని ప్రతి ఏటా కార్పొరేటు సంస్థల రుణాలను మాఫీ చేస్తూ ఇందుకు ప్రతిఫలంగా బిజెపి ఈ కార్పొరేటు సంస్థల యజమానుల నుండి ఎన్నికల బాండ్ల రూపంలో వేలకోట్ల రూపాయలను ఎన్నికల ఫండ్ గా పొందుతోందని ఆరోపించారు. ఈ ఎన్నికల బాండ్ల విషయంలో జరుగుతున్న మోసాన్ని దేశంలో ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బండ కింది అరుణ్ కుమార్, ముస్త్యాల ప్రభాకర్, ఇప్పకాయల శోభ, బోయిని మల్లేశం, ఆముదాల నర్సిరెడ్డి, గుండ్ల రవీందర్, ఎర్రబోసు అశోక్, మేర్గో జు సత్యనారాయణ, తొడంగల రామచంద్రం, మంచాల నారాయణ, మేర్గోజు రామచంద్రం, బుట్టి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ప్లకార్డులతో నిరసన

ఎలక్ట్రోల్ బాండ్లపై సుప్రీంకోర్టుకు అందుబాటులో సమాచారం లేదని తప్పుడు సమాచారం ఇచ్చిన ఎస్బిఐ చైర్మన్ వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం)పార్టీ గజ్వేల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ ఎస్బిఐ బ్యాంకు ముందు ప్లే కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒత్తిడి లొంగి సుప్రీంకోర్టుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు అడవులు ప్రజా సంపదను కార్పొరేట్ సంస్థలు కారు చౌకగా కొనుగోలు చేస్తూ క్రోని క్యాపిటల్ ద్వారా కార్పొరేట్ సంస్థలు లాభాలు పెంచుకుంటూ ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రంగారెడ్డి నాయకులు వెంకట్ చారి అఫ్జల్ నర్సింలు మహేందర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని అంగడి కిష్టాపూర్ గ్రామంలో గల ఉమామహేశ్వర పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం ప్రాత్త కాల పూజ, అభిషేకము, బలిహరణము, హవనము, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతము,రాత్రికి ప్రదోషకాల పూజ, సాయం ఔపాసనము, బలిహరణము, హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ చైర్మన్ బల్లి శ్రీనివాస్ గుప్త, తాజా మాజీ సర్పంచ్ దుద్దెడ లక్ష్మి రాములు గౌడ్, ఎంపిటీసి గోలి నరేందర్,ప్రదాన అర్చకులు వెంకట నర్సింహ్మా శర్మ, ఆలయ అర్చక సహాయకులు లింగమూర్తి, వీరేశం, , మాజీ ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, అయల కమిటీ సభ్యులు కె.మహేందర్ రెడ్డి,దుద్దెడ నర్సింలు గౌడ్,కమ్మరి లక్ష్మణ్, లింగని రాములు,మీసాల శ్రీనివాస్ రెడ్డి,కంది నరసింహ చారి,ముద్రాతి బాల్ రెడ్డి, అంజనేయులు, కుమ్మరి కనకయ్య, సుదర్శన్ గౌడ్,రాము గౌడ్,వెంకటేష్, నరసింహ చారి,శ్రీనివాస్,గడీల వెంకట్, తిరుపతి, రుక్మారెడ్డి,శ్రీదర్ రెడ్డి, నాగరాజ, నాగేష్,లింగని రాజు, తదితరులున్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ -సిద్దిపట కలెక్టరేట్



సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....ప్రజావాణి కార్యక్రమం పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ఎంతో నమ్మకం తో జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలను విన్నవించుకోని పరిష్కారానికి ప్రజావాణి కి వస్తారని అంతే నమ్మకంగా అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించినచో వారికి న్యాయం చేసిన వాళ్లం అవుతామని జిల్లా అధికారులకు సూచించారు. ప్రజావాణిలో భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతర మొత్తం కలపి 59 దరఖాస్తులు స్వీకరించారు. ఇట్టి కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి జయదేవ్ ఆర్యా కలెక్టరేట్ ఎఓ అబ్దుల్ రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం...

- మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు
- పోటీల్లో సత్తా చాటిన గురుకుల బాలికలు..

నవతెలంగాణ-దుబ్బాక



నేడు బాలికలు,మహిళలపై జరుగుతున్న దాడులను ఎదుర్కో వడానికి వారి స్వీయ రక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుం దని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మహిళలు తమని తాము కాపాడుకునేందుకు కరాటే ఓ ఆయుధం కావాలన్నారు.సన్ ఫైన్ షోతో ఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా మనోహరాబాద్ లోని శుభం ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన "2 వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే అండ్ కుంగ్ ఫు ఛాంపియన్షిప్ పోటీ"ల్లో దుబ్బాక మండల పరిధిలోని రామక్కపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని యువ స్పోర్ట్స్ కరాటే ఆకాడమీ తెలంగాణ వ్యవస్థాపకులు అండ్ స్టైల్ చీఫ్ మాస్టర్ బురాని శ్రీకాంత్ అన్నారు తెలిపారు.ఈ పోటీలకు ముఖ్యాతిధులుగా హాజరైన మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డిల చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 34 మంది విద్యార్థినిలకు మెడల్స్ ను అందజేశారని మాస్టర్ శ్రీకాంత్ తెలిపారు. మెడల్స్ సాధించిన రామక్కపేట గురుకుల పాఠశాల విద్యార్థినులు స్నేహ, నవనీత, స్పందన, మనీషా, రాధిక గోల్డ్ మెడల్స్, స్రవంతి, అశ్వగంధ, లిఖిత, మౌనిక, వర్షశ్రీ, వెన్నెల, వైష్ణవి, శరణ్య, కావ్యశ్రీ, దీక్షిత, అర్చన, అక్షిత, హారిక, జెస్సికా, మేఘన, అంకిత, నిహారికలు సిల్వర్ మెడల్స్, అలాగే నందినిప్రియ, వర్షిత, పవిత్ర, కీర్తన, మానస, గౌతమి,విజ్ఞశ్రీ నేహా, సీహెచ్ మానస, కీర్తన, లాస్య, అలేఖ్యలు బ్రౌంజ్ మెడల్స్ ను సాధించినట్లు మాస్టర్ బురాని శ్రీకాంత్ వెల్లడించారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీకాంత్ ను విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ ఉషాకిరణ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

శ్రీరామ కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన హరీశ్‌రావు

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట గణేష్ నగర్ లోని శ్రీ ప్రసన్నంజనేయ స్వామి దేవాలయం లో నూతనంగా నిర్మించిన శ్రీరామ కల్యాణ మండపాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆలయం దిన దినాభివృద్ధి జరగడం చాలా సంతోషమని, దైవ చింతన ఆధ్యాత్మిక తో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. సిద్దిపేట ఆధ్యాత్మికతను ఒడిసి పట్టిన నెల అని అన్నారు. అంతకు ముందు ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అంత మనవాళ్లే..ఎలాగైన పాసవచ్చు..!

- పది పరీక్షలపై విద్యార్థులకు బోధనా సిబ్బంది భరోసా..?
- ఈ నెల 18 నుంచి పది పరీక్షలు

అంత మనవాళ్లే..ఎలాగైన పాసవచ్చు. మండలంలోని అయా పాఠశాలల్లోని కొంతమంది బోధనా సిబ్బంది పదవ తరగతి విద్యార్థులకు భరోసా ఇచ్చినట్టు సమాచారం. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న బోధనా సిబ్బంది తీరుపై కొందరు అసహనం వెల్లగక్కుతున్నారు. అందులో తప్పు ఏమి ఉందని మరికొందరు అంటున్నారు. ఈ నెల 18 నుండి పది పరీక్షలు ప్రారంభమవ్వనున్నాయి.కేంద్రాల్లో పరీక్షల నిర్వాహకులుగా మండలంలోని ఉపాధ్యాయులే విధులు నిర్వర్తిస్తుండడంతో సహాయ సహకారాలు మెండుగా అందిస్తారనే ప్రచారం ఎన్నో ఏండ్లుగా సాగుతూనే ఉంది.దీంతో ప్రతిభ ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంత అలజడి మొదలైంది. సిబ్బంది ఐచ్చిక పాఠ్యాంశాలను క్షుణ్ణంగా బోధించకుండా విద్యార్థులు మాల్ ప్రాక్టిస్ కు పాల్పడేలా ప్రోత్సహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో 10 జిల్లా పరిషత్,౧ కజీవీబీ,ఆదర్శ, సాంఘీక సంక్షేమ గురుకుల, 07 ప్రయివేట్ విద్యాలయాలున్నాయి.ఈ యేడాది ప్రభుత్వ పాఠశాల నుండి 223,ప్రయివేట్ పాఠశాలల నుండి 338 మంది(561)విద్యార్థులు పది పరీక్షలకు హజరవుతున్నారు. మండల కేంద్రంలోని బాలికల,బాలుర ప్రభుత్వోన్నత పాఠశాలల్లో ప్రభుత్వం పది పరీక్షల కేంద్రాలను ఏర్పాటుచేసింది. మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు హుస్నాబాద్,రేగులపల్లి ప్రభుత్వోన్నత, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు కోహెడ మండలంలోని శనిగరం ప్రభుత్వోన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రంలో పరీక్షలకు హజరవ్వనున్నారు.ప్రభుత్వోన్నత 09,కేజీవీబీ, ఆదర్శ,06 ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హజరవ్వనున్నారు.

మండలంలోని అయా ప్రభుత్వోన్నత పాఠశాలల్లోని బోధన సిబ్బంది పాఠ్యాంశాల బోధనను పూర్తి చేశారు.పూర్తి చేసిన పాఠ్యాంశాలపై బోధన సిబ్బంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షల సమయం దగ్గరపడుతుండడంతో కొందరు విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొంత భయానక వాతవరణం నెలకొంది. విద్యార్థులకు క్రమశిక్షణను అలవర్చి స్వతహాగా మనోధైర్యంతో పరీక్షలకు హాజరయ్యేలా తీర్చిదిద్దాలని బోధన సిబ్బందికి పలువురు విన్నవిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా పకడ్బందీగా పది పరీక్షలు నిర్వహిస్తే ప్రతిభ ఉన్న విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు

: పావని, ఎంఈఓ బెజ్జంకి



పది పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ ఆదేశానుసారం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తాం. మాల్ ప్రాక్టిస్ పాల్పడిన విద్యార్థులపై..మాల్ ప్రాక్టిస్ కు ప్రోత్సహించిన సిబ్బందిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు. పది పరీక్షలకు విద్యార్థులు మనోధైర్యంతో హాజరవ్వాలి. పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం ఏర్పాటుచేసాను. సమావేశంలో పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది వ్యవహరించే తీరు,నిబంధనలపై అవగాహన కల్పిస్తాం.

గృహజ్యోతి పథకం కోసం బారులు తీరిన జనం

నవతెలంగాణ-మర్కుక్





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో విద్యుత్ బిల్లు రానివారు సోమవారం మర్కుక్ ఎంపీడీవో కార్యాలయం వద్ద మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు దరఖాస్తులు చేసుకోవడానికి బారులు తీరారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి అన్ లైన్లో పొరపాట్లతో జరగడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో మర్కుక్ ఎంపీడీవో కార్యాలయం వద్ద బారులు తీరారు.

నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం గహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి ఉచితంగా విద్యుత్ అందించే పథకం కోసం సోమవారం ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో భారీగా బారులు తీరారు. ప్రజల తాకిడి ఎక్కువ కావడంతో 5 కౌంటర్లు ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

భీం దీక్ష వాల్ పోస్టర్ ఆవిష్కరణ...



నవతెలంగాణ-బెజ్జంకి

మహనీయుల జయంతులను పురస్కరించుకుని ప్రతి యేటా మార్చి 15 నుండి ఏప్రిల్ 14 వరకు స్వేరోస్ నెట్ వర్క్ అధ్వర్యంలో భీం దీక్ష చేపడుతున్నట్టు స్వేరోస్ నెట్ వర్క్ జిల్లాధ్యక్షుడు ఉప్పులేటి బాబు తెలిపారు.సోమవారం మండల కేంద్రంలోని మిని స్టేడియం నందు భీం దీక్ష వాల్ పోస్టరును బాబు స్థానికులతో కలిసి అవిష్కరించారు.బోనగిరి లక్ష్మణ్,కల్లూరి అజయ్ కుమార్,బోనగిరి నవీన్, విజయ్,లింగాల శంకర్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ చేయలేదా?

- ఓటిపి పేరుతో లబ్ధిదారులకు అవస్థలు



నవతెలంగాణ- గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు సంక్షేమ పథకాలకు ప్రజలు దరఖాస్తు పెట్టుకోగా వాటిని మున్సిపల్ కార్యాలయాల్లో డేటా ఎంట్రీ చేయలేదు. దీంతో దరఖాస్తు చేసుకున్న వాటికి ఏది కూడా ఆన్లైన్ అప్డేట్ కావడం లేదు. మున్సిపల్ శాఖ అధికారులు సిబ్బంది నామమాత్రంగా ఆన్లైన్లో పేర్లు మాత్రమే అప్లై చేసి పెట్టడంతో రూ 500 కి గ్యాస్, 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ తో పాటు గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, 4000 పెన్షన్ విధానం ఆన్లైన్లో పొందుపరిచినప్పటికీ ప్రభుత్వానికి అవి అప్డేట్ కానట్టు కనిపిస్తుంది. సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ భవనం వద్ద బారులు తీరిన ప్రజల నుండి నవ తెలంగాణ సమాచారం తీసుకోగా తాము అప్లై చేసిన ఏ పథకం కూడా అప్డేట్ కావడం లేదని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. ముఖ్యంగా 200 విద్యుత్తు ఉచిత యూనిట్లు, 500 కి గ్యాస్, ఇందిరమ్మ గృహ పథకం, మహిళలకు 2500 ఉచితంగా అందించడం, నూతన పెన్షన్ రూ 4000.00 అప్లై చేసుకున్న58 సంవత్సరాలు నిండిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్లైన్లో మాత్రమే వాటిని ఉంచారు. ఇప్పుడు కేవలం గ్యాస్, 200 ఉచిత యూనిట్లు అమలు చేస్తుండడంతో ప్రజలు ఈ రెండిటి కోసమే ఈ స్థాయిలో మున్సిపల్ కార్యాలయాలకు బారులు తీరుతున్నారు. మిగతా గ్యారెంటీ లకు మళ్లీ బారులు తప్పవని వీటిని బట్టి స్పష్టమవుతుంది. ప్రజాపాలనను తీసుకున్న దరఖాస్తులు కేవలం ఆన్లైన్లో ఉంచారు తప్ప వాటిని అప్డేట్ చేయలేదని స్పష్టం అవుతుంది. ఇందిరమ్మ పథకం మంగళవారం నుండి ప్రారంభం అవుతున్న దశలో తిరిగి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే పరిస్థితి కి వచ్చింది. ప్రతి లబ్ధిదారు నుండి ఫోన్ నెంబర్ ఉన్నప్పటికీ ఓటీపీ లేనందునే ఈ సమస్య వస్తుందని సంబంధిత మున్సిపల్ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. ప్రజాపాలనలో ప్రతి ఒక్కరు ఫోన్ నెంబరు కూడా అందజేశారు. అయితే ఆన్లైన్లో దరఖాస్తు అప్డేట్ చేస్తే లబ్ధిదారులు ఫోన్కు ఓటిపి వస్తుంది. అది చెప్తే మాత్రం దరఖాస్తు అప్డేట్ అవుతుంది. ఈ సమస్య తలకు మించిన భారం అవుతుందని భావించిన మున్సిపల్ సిబ్బంది కేవలం ఆన్లైన్లోనే దరఖాస్తులను ఫీడింగ్ చేసినట్లు కనిపిస్తుంది. తిరిగి మున్సిపల్ కార్యాలయాలకు ప్రజాపాలన దరఖాస్తు లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. మున్సిపల్ సిబ్బంది అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రంజాన్ మాసం శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట



రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లింలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో నిర్వహించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్ధనలతో సామరస్యం, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం విశిష్టత అని అన్నారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ముస్లింలు నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో , నిష్టగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తారని అన్నారు. సేవా దృక్పథానికి, సహనానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవడం ఎంత సంతోషంగా ఉంటుందని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వడ్రంగి సంఘ అభ్యున్నతికి కృషి : సుంకోజు ప్రవీణ్



నవతెలంగాణ- దుబ్బాక

పట్టణంలోని వడ్రంగి సంఘం అభ్యున్నతి కోసం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మయబ్రహ్మ వడ్రంగి సంఘం నూతన అధ్యక్షుడు సుంకోజు ప్రవీణ్ కుమార్ చెప్పారు.సభ్యులందరి సహకారంతో సంఘ గౌరవాన్ని పెంపొందించేందుకు పాటుపడతానన్నారు.సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలో 'మయబ్రహ్మ వడ్రంగి' సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు..అధ్యక్షుడిగా సుంకోజు ప్రవీణ్ కుమార్,ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి రాజు,ప్రధాన కార్యదర్శి బెజ్జంకి వంశీకష్ణ,కోషాధికారి బెజ్జంకి సప్తగిరి, కార్యవర్గ సభ్యులుగా వడ్ల నరసింహచారి,సుంకోజు చారి,మంచోళ్ళ సురేష్,పుల్లూరు నరేంద్ర సాయి,మాదాసు సంతోష్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించారు.

ప్రజా పాలన దరఖాస్తుల డాటా ఎంట్రీలో నిర్లక్ష్యం

- ఎంపీడీవో కార్యాలయం ముందు బారులు తీరిన లబ్ధిదారులు
- ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

నవతెలంగాణ-నంగునూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా ప్రజా పాలనలో సేకరించిన దరఖాస్తులు అధికారుల నిర్లక్ష్యం మూలంగా సరిగా డాటా ఎంట్రీ చేయకపోవడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం పథకాలు అమలు కాని లబ్ధిదారులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అవకాశం ఇవ్వడంతో సోమవారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయం ముందు క్యూలో నిల్చుని ఎండలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాల్లో కొందరికి పథకాలు అమలు కావడంతో పథకాలు రాని నిరుపేదలు అయోమయానికి గురై ఎంపీడీవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంటు బిల్లు పక్కింటి వారికి జీరో బిల్లు వచ్చినప్పటికీ తమకు ఎందుకు రాలేదని ఆవేదన గురవుతున్నారు. గ్యాస్ బిల్లులు సైతం గ్రామాల్లో కొంతమందికి వచ్చాయని మాకెందుకు రాలేదని మేము నిరుపేదలమేనని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి నిరుపేదలైన లబ్ధిదారుల డాటా ఎంట్రీని సరిగా చేసి ప్రభుత్వ పథకాలు అమలు అయ్యేలా చూడాలని ఆయా గ్రామాల నిరుపేదలు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలు అందరికి అమలయ్యేలా చూడాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో హామీ ఇచ్చి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని లబ్ధిదారుల ఎంట్రీలో అలసత్వం ఎందుకని నంగునూరు మండలం రాజగోపాల్ పేట గ్రామానికి చెందిన పరమాండ్ల మల్లేశం ఆరోపించాడు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు గ్రామానికి వచ్చి లబ్ధిదారుల వివరాలు ఎంట్రీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోజూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నిరుపేదలను తిప్పుకోవడం సమంజసంగా లేదని లబ్ధిదారులు ఆరోపించారు.

'కుష్టు' నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-మద్దూరు



'కుష్టు' నిర్మూలనకు ప్రజలు సహకరించాలని. మద్దూరు మండలంలోని లద్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్టువర్ట్సన్ కోరారు. సోమవారం ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆశా కార్యకర్తలు పి ఎస్ సి పరిధిలోని లద్నూర్, బైరాన్ పల్లి, కొండాపూర్, మర్మముల, రేబర్తి, గ్రామాలలో కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించినట్లు ఆయన తెలిపారు, కుష్టి వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని. ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న తాగునీరు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని గీకురోనీ బావి (వాయిలోంపు) కాలనీలో అక్కడి ప్రజలకు మున్సిపల్ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం కోసం ఒక మోటార్‌ను ఏర్పాటు చేశారు. అదే మోటార్ ద్వారా అందుకు విరుద్ధంగా అక్కడున్న కొందరు వ్యక్తులు తమ వ్యవసాయ పొలాలకు నీటిని వాడుకుంటున్నారు. పట్టణంలో మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోపక్క కొంతమంది తాగునీటిని వ్యవసాయ పొలాలకు వాడుకుంటున్నారు. అది చూసిన కొందరు 24 గంటలు మోటార్ నడిచి రిపేరుకు వస్తే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. కాలని వాసుల అవసరం మేరకు తాగునీటి మోటార్ ను ఉపయోగించుకోవాలి తప్ప తమ ఇష్టారాజ్యంగా వాడితే మున్సిపాలిటీకి చిల్లు తప్పదని చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే మున్సిపల్ సిబ్బంది కనుసన్నల్లో నడుస్తుందని అందుకు చేతివాటం ప్రదర్శిస్తేనే మంచినీరు పక్కదారి పడుతుందని వాదనలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటివి పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

నవతెలంగాణ - కొండపాక



సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం కొండపాక ఆనంద నిలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గైనకాలజిస్ట్ క్రాంతి, వృద్ధాశ్రమంలోని రత్నమాల అనే వృద్ధురాలికి సన్మానం చేశారు. వృద్ధులకు పలు రకాల ఆరోగ్య సమస్యలపై వైద్యులు సూచనలు ఇచ్చారు. పలువురు మహిళలకు దుస్తులు, అనాథ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, ప్రధాన కార్యదర్శి పబ్బ మాధవి, అదనపు కార్యదర్శి గౌరిశెట్టి సునీత, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి ఆర్గనైజింగ్ సెక్రెటరీ మేఘమాల , తోట పద్మ , అష్టాదశ శక్తిపీఠం ట్రస్ట్ అధ్యక్షులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వచ్చింది... కరువు తెచ్చింది

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట



కాంగ్రెస్ వచ్చింది... కరువు తెచ్చిందని, పదేండ్లలో బోర్ బండి కనపడ్డదా, కాంగ్రెస్ పాలనలో నీళ్ళ కష్టాలు, కరెంట్ కష్టాలు ప్రారంభం అయ్యాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గ ముఖ్యనాయకులతో సోమవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం హరీశ్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలి అంటే బి ఆర్ ఎస్ ఎంపీ లు గెలవాలని, కాంగ్రెస్ ఉద్దెర హామీలు ఇచ్చింది కానీ, నగదు హామీలు, గ్యారెంటీ లు పత్తాలేవని అన్నారు. రైతు బంధు, రైతు ఋణమాఫీ, వరి పంటకు బోనస్ ఇవ్వన్నీ ఒట్టి మాటలు ఉద్దెర మాటలని అన్నారు. ఆరోగ్య లక్ష్మి కింద 10 లక్షల పథకం అమలు చేస్తే రాష్ట్రం లో ఏ ఒక్కరికి అయిన 10లక్షలు ఇచ్చారా, మహిళలకు 2500 ఇస్తా అన్న మాట ఏమైందని ప్రశ్నించారు. ముసలోళ్ళకి డిసెంబర్ నెల నుండి 4వేల పెన్షన్ ఇస్తా అన్నారు, 4 నెలలు అయింది కానీ ఇప్పటి కి అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల అంతటా చర్చ మొదలైందని, ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచినా ఢిల్లీలో కాంగ్రెస్ వచ్చేది లేదని, ఓడినా ఎలాంటి నష్టం లేదన్నారు. హామీల అమలుపై బాండ్లు రాసిచ్చారని, కానీ గెలిచాక ముఖం చాటేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు కావాలంటే నిలదీసే బి ఆర్ ఎస్ ను గెలిపించాలని, బీజేపీ తెలంగాణ కు చేసింది ఏమీ లేదన్నారు. ఒక్క ప్రాజెక్ట్ కు జాతీయ హెూదా ఇవ్వలేదని, తెలంగాణ కు ఒక్క నవోదయ స్కూల్ ఇవ్వలేదని, 157 మెడికల్ కాలేజ్ లు మంజూరు చేస్తే తెలంగాణ కు ఒక్క మెడికల్ కాలేజ్ ఇవ్వలేదన్నారు.

ప్రజల గొంతుక గా మనం మాట్లాడుదామని, అందుకే ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు ఫారూఖ్ హుస్సేన్, రాధాకష్ణశర్మ నాగిరెడ్డి, మల్లయ్య రామచంద్రం, మాణిక్య రెడ్డి, గుండు భూపేష్, వేణుగోపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగాలి

ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ
గౌడ్ కమ్యూనిటీ హాలు ప్రారంభించిన మాజీ మంత్రి హరీష్

నవతెలంగాణ - చిన్నకోడూరు



మహిళలు ఆర్థికంగా ఎదిగి, తమ కాళ్ళ పై తాము నిలబడాలి అన్నదే నా తపన అని మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండలంలోని పెద్దకోడూరు, చంద్లాపూర్ గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణ పొందిన 300మంది మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ లు హరీష్‌రావు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మహిళల చైతన్యం.. ప్రతిరంగంలో మీ స్ఫూర్తి గొప్పదని కొనియాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో 2200 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని, 10వేలు విలువ గల మిషన్ లు కూడా ఉచితంగా ఇస్తున్నట్లు అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. గత ఎండాకాలం ఈ సమయానికి కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయించి చెరువుల్ని, కుంటల్ని, చెక్ డ్యామ్ లను నింపుకున్నామనీ, నిండు ఎండా కాలంలో కూడా పంటలు ఎండిపోకుండా కాపాడుకున్నట్లు తెలిపారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయమే ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ నీళ్ల విడువడం లేదని ఆరోపించారు. నీళ్ల అందక రైతులు కష్టాలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హల్ ని జడ్పీ చైర్ పర్సన్ రోజా శర్మతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించి మాట్లాడారు. ఎల్లమ్మ దయతో ఈ ఆలయం దినదిన అభివృద్ధి జరిగిందని, రూ.20లక్షలతో ఈ కమ్యూనిటీ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నీళ్ళు లేక పంటలు ఎండిపోతుంటే చిన్నకోడూరు మండలంలో ఎండాకాలంలో కూడా చెరువుల్లో నీరు ఉందంటే కాళేశ్వరం వల్లే, కెసిఆర్ వల్లే అని అన్నారు. కెసిఆర్ వచ్చాక గౌడ కమ్యూనిటీకి చెట్ల పన్ను రద్దు చేశామని, వైన్స్ టెండర్ల లలో గీత కార్మికులకు రిజర్వేషన్లు తెచ్చామని గుర్తు చేశారు. ఎంపిపి కూర మాణిక్య రెడ్డి, సొసైటీ చైర్మన్లు సదానందం, కనకరాజు, మాజీ ఎంపిపి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు గౌడ సంఘము సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు చేయటం అలవర్చుకోవాలి

నవతెలంగాణ-నంగునూరు



నెలలో కనీసం ఒక రోజు సంపాదనైన పొదుపు చేయటం వలన ఆపదలో ఇతరులపై ఆధారపడకుండా ఉండకలుగుతామని రాజగోపాల్ పేట పురుషుల పొదుపు సమితి అధ్యక్షుడు కడారి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం నంగునూరు పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన మచ్చ మోహన్ ఇటీవలే మరణించారు. ఆయనకు సంఘం తరపున మంజూరైనటువంటి సామూహిక నిధి, బీమా క్లైం, అభయ నిధిపత్సాహాయం మొత్తం 40 వేలు నగదును నామినైన కుమారుడు మచ్చ ప్రవీణ్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఒక క్రమం పద్ధతిలో నియమిత పొదుపు చేసుకునే అవకాశాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పురుషుల సంఘంలో సభ్యుడిగా నమోదైన వారు సామూహిక బీమా నిధి పథకంలో చేరితే ఎలాంటి మరణం సంభవించినా నామినీకి 40వేల నగదును సహవికాస సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాజపేట గోపాల్, ఉపాధ్యక్షుడు ఆరె శ్రీనివాస్, పాలక వర్గసభ్యులు వల్లపు రెడ్డి రాంచంద్రారెడ్డి,పులి రవి, దేవులపల్లి నర్సింగారావు, గణకుడు కోల రాజశేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు వ్యక్తి మృతి

నవతెలంగాణ-వర్గల్



రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గౌరారం గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. గౌరారం గ్రామానికి చెందిన కిష్టారెడ్డి (20) ఆదివారం రోజు రాత్రి వర్గల్ కి వెళ్తుండగా మార్గమధ్యలో కారు అదుపుతప్పి చెట్టును ఢీ కొన్నాడు. కిష్టారెడ్డి తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి భూపాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు గౌరారం ఎస్సై శివకుమార్ తెలిపారు.

పైరవీలు పనిచేయవు ..

కష్టపడ్డ వాళ్లకే నామినేట్ పదవులు : చెరుకు శ్రీనివాస్ రెడ్డి
కాంగ్రెస్‌లో చేరిన సల్కం మల్లేష్, పీఏసీఎస్ వైస్ చైర్మన్

నవ తెలంగాణ- దుబ్బాక



నామినేటెడ్ పదవులు కావాలంటే పైరవీలు పనిచేయవని కష్టపడ్డ వాళ్లకే వస్తాయని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తమ తమ బూత్‌లలో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీని అందించిన వారికే నామినేటెడ్ పదవులు తప్పక వర్తిస్తాయన్నారు. బీఎస్పీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ సల్కం మల్లేష్ యాదవ్ తన అనుచరులతో కలిసి,అలాగే దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ కూడా చెరుకు శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ లోకి చేరారు.ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ...నియంత ప్రభుత్వానికి చరమగీతం పాడిన తెలంగాణా ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని అన్నారు. దశాబ్ద కాలంగా దుబ్బాక నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న పనులన్నిటిని 6 నెలల్లో పూర్తి చేస్తామని ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి రూ.35 కోట్లు మంజూరు చేశాడని గుర్తు చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దుబ్బాక నియోజకవర్గం అన్నింటా వివక్షకు గురైందని విమర్శించారు.

కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల భీమా చెక్కు అందజేత

ప్రమాదవశాత్తు మరణించిన అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దూలం రాజలింగం గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. ఈ చెక్కును దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్, మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, తాళ్లపల్లి, అక్బర్ పేట గ్రామ అధ్యక్షులు వేల్పుల యాదగిరి, కూతురు చందు పలువురితో కలిసి చెరుకు శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్,మున్సిపల్ అధ్యక్షుడు నర్మేట ఏసురెడ్డి,మండల అధ్యక్షుడు కొంగర రవి,ఉపాధ్యక్షుడు కడుదూరి నరేందర్ రెడ్డి,నియోజకవర్గ యూత్ అధ్యక్షులు ఆకుల భరత్,మున్సిపల్ యూత్ అధ్యక్షుడు కరాటే శ్రీకాంత్,ఉషయ్యగారి రాజిరెడ్డి,మంద శ్రీనివాస్,శ్రీరామ్ నరేందర్,అనంతుల రాజులు,మట్ట కిషన్ రెడ్డి,తొట్ల చంద్రం,బాస మధు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొనసాగిన సర్వసభ్య సమావేశం

గంట ఆలస్యంగా సభ ప్రారంభం
గ్రామాలలో నెలకొంటున్న మంచినీటి సమస్య
కొంతమంది ప్రత్యేక అధికారులు నామమాత్రమే
సభను ఉద్దేశించి మాట్లాడిన ఎంపీపీ సంధ్య

నవ తెలంగాణ - దౌల్తాబాద్



ప్రజా సమస్యలను పరిష్కారం చేయడం కోసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సోమవారం అధికారులు ప్రజాప్రతినిధుల కారణంగా సుమారుగా గంట సేపు ఆలస్యంగా ప్రారంభమైంది పాఠశాలలో విద్యార్థులు ప్రశ్న జవాబులు చదివినట్లుగా అధికారులు కార్యాలయ సిబ్బంది ఇచ్చిన కాపీని చదివి వినిపించడం జరిగింది ముందుగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వరి 16,150 ఎకరాలు, మొక్కజొన్న 748 ఎకరాలు, 653 ఎకరాలు కూరగాయలు, ఇతర పంటలు 248 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మండల వ్యాప్తంగా సాగు అయిన పంటలు 17వేల 835 ఎకరాలు సాగుల్లో ఉన్నాయి. రైతుబంధు విషయానికొస్తే ఎకరానికి 5000 రూపాయలు చొప్పున పెట్టుబడి సాయం కింద యాసంగి కల్లాలకు రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు మండల వ్యాప్తంగా మొత్తం రైతులు 13,570 ఉండగా పెట్టుబడి సాయంగా 10,62,29,863 రూపాయలను కొత్త ప్రభుత్వం రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. 5 లక్షల బీమా కోసం 7618 మంది అన్నదాతలు నమోదు చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు ఈ పథకం ద్వారా 48 మంది రైతులు మరణించడం జరిగిందన్నారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం పాలసీలో ఉన్న నామినిదారులకు 5 లక్షల రూపాయల చొప్పున జమ చేయడం జరిగిందని చదివి వినిపించారు.

పిఎం కిసాన్ ద్వారా 2019 ఫిబ్రవరి నెలలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా 140 ఎకరాల ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేయడం జరిగిందన్నారు. ఆసక్తి గల అన్నదాతలు సబ్సిడీ రూపంలో సాగు చేసుకోవచ్చని ఆయన అన్నారు నంగునూరు మండలంలో రైతులు పామ్ ఆయిల్ గింజలను అమ్ముకునేందుకు ఫ్యాక్టరీని నిర్మాణం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. పశు వైద్య సిబ్బంది మండలంలో సాధారణ టీకాలు ఐదు, 426 గర్భకోశ వ్యాధి చికిత్సలు, 72 నట్టల నివారణ మందులు, 42 పశువులకు మొదలగు టీకాలను వేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అల్లిశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు మల్లేశం, బోటుకు తిరుపతి అనిత, దేవేందర్, అహ్మద్ ప్రత్యేక అధికారులు బాలకృష్ణ, డాక్టర్ నాగరాజు, ఎంఈఓ నరసవ్వ, డిప్యూటీ తాసిల్దార్ జహీర్, సెర్ప్ అధికారి ఆశ, కిషన్, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీ ఓ గఫూర్, శ్రీరామ్, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా అవకాశాలు అందించాలి

సీపీ. డాక్టర్. బి. అనురాధ

నవ తెలంగాణ - సిద్దిపేట అర్బన్



మహిళలకు సమాన అవకాశాలు, స్వేచ్ఛ అందించగలిగితే మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణిస్తారని సీపీ. డాక్టర్ బి.అనురాధ అన్నారు. సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్ లో జిల్లాలో ఉన్న మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు మహిళా దినోత్సవం జరుపుకునే రోజు రావాలని, మహిళలు అనుకుంటే సాధించినది ఏదీ లేదని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఉద్యోగ బాధ్యతలతో పాటు సంసార బాధ్యతలు కూడా ఈ రెండింటినీ సమానంగా పెనవేసుకుని ముందుకు వెళ్లడం అభినందనీయమని కొనియాడారు. కమీషనరేట్ పరిధిలో మహిళల, పిల్లల సంరక్షణ కోసం ప్రత్యేకంగా షీటిమ్స్ లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మహిళకు రక్షణ కల్పించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల రక్షణకు డిపార్ట్మెంట్ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం డిపార్ట్మెంట్ లో ఉత్తమ సేవలు అందించిన పలువురు మహిళా సిబ్బందిని అభినందించి శాలువా, మెమొంటో తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఓ యాదమ్మ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, మహిళా ఏఎస్ఐలు, రుక్కమ్మ, సువర్ణ, పరమేశ్వరి, మనీ, భవాని, హెడ్ కానిస్టేబుళ్లు స్వాతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్ ను వెంటనే అరెస్టు చేయాలి

దుబ్బాకలో సీపీఐ(ఎం) నాయకులు నిరసన



నవ తెలంగాణ- దుబ్బాక

ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించకుండా కేంద్ర సర్కారుకు తొత్తుగా వ్యవహరిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ ను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి భాస్కర్ డిమాండ్ చేశారు. ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేస్తూ సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఐ(ఎం) నాయకులు ఫ్ల కార్డులతో నిరసన తెలిపారు.అనంతరం జి.భాస్కర్ మాట్లాడుతూ ... దేశంలో ఎన్నికల బాండ్ల విధానాన్ని మోడీ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందని ఎన్నికల బాండ్లు బీజేపీ అతిపెద్ద అవినీతి బాగోతమని విమర్శించారు. ఎన్నికల బాండ్లను సీపీఐ(ఎం) మొదటి నుండి వ్యతిరేకిస్తుందని గుర్తు చేశారు..ఎన్నికల బాండ్లలో చెల్లించిన మొత్తాలను వెంటనే బహిర్గతం చేసి సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలని డిమాండ్ చేశారు.లేని యెడల ఎస్ బీఐ చైర్మన్ పై కోర్టుదిక్కరన కింద కేసు నమోదు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు లక్ష్మి నరసయ్య,సాజిద్,రాజు, మహేష్,రవి,మల్లేశం,శివకుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గంజాయి అమ్మకాలపై చర్యలేవి..?

మామూళ్ల మత్తులో అధికారులు...
బీజేవైఎం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్



హుస్నాబాద్, అక్కన్నపేట మండల పరిధిలోని గ్రామాలలో గంజాయి అక్రమ అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్న అధికారులు చర్యలు చేపట్టడం లేదని బీజేవైఎం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ ఆరోపించారు. సోమవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుస్నాబాద్, అక్కన్నపేట పట్టణ ,గ్రామాలలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్న అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. కిరాణా షాపులు, పాన్ షాపులలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు అడ్డాగా గంజాయి అమ్మకాలు జరుగుతున్న అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కొన్ని పాన్ షాప్ల లలో సిగరెట్లలో గంజాయిని పెట్టీ మరీ సిగరెట్ అమ్మకాలు చేస్తున్నారని, పాన్ షాపు యజమానులు కిరాణా షాప్ యజమానులు పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు సైతం సిగరెట్లు అమ్ముతున్నారని అన్నారు చిన్నపిల్లలకు సిగరెట్లు అమ్మకూడదని నిబంధనలు ఉన్నా అవేవీ పట్టించుకోవడం లేదన్నారు .పిల్లల భవిష్యత్తును గంజాయి మత్తు లోకి నెట్టేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక నిషేధిత తంబాకు, గుట్కా ప్యాకెట్లను బహిరంగ అమ్మకాలు జరుగుతున్నాయని అన్నారు .గతంలో అంబర్ ,గుట్కాల అక్రమ రవాణా చేసిన వారే కొత్త తరహాలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారన్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.

నియంతకు కేరాఫ్ నర్సారెడ్డి

నిరసన వ్యక్తం చేసిన శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ - ములుగు

సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి నియంతగా ప్రవర్తిస్తూ పార్టీలో పనిచేసిన వారికి సముచిత న్యాయం కల్పించకుండా తనకు కొమ్ముకాసే వారికి అందాలమెక్కించడం వల్లే పార్టీకి పతనం ప్రారంభం అయిందని కాంగ్రెస్‌పార్టీ నేత శ్రీనివాస్‌గుప్తా అన్నారు. . సోమవారం ములుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండి కాంగ్రెస్ కార్యకర్తలపై ఎన్ని ఒత్తిళ్లకు గురిచేసినా ,పార్టీ కోసం కష్టపడి నిలబడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఓ పర్యటన నేపథ్యంలో మండలానికి వచ్చిన పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పార్టీ కార్యాలయాన్ని సందర్శించి తనను ప్రశంసించారని శ్రీనివాస్ గుప్తా గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి హవాతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా కలిసి వచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకుల నర్సారెడ్డికి అదృష్టం వరించిందన్నారు.2014లో గజ్వేల్ అసెంబ్లీ అభ్యర్థిగా తూముకుంట నర్సిరెడ్డి నిలబడి టిఆర్ఎస్ పార్టీకి రాత్రికి రాత్రి బేరం కుదిరించుకొని కోట్లు గడించిన వ్యక్తి నర్సారెడ్డి అని, అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి తల్లి పాలు తాగి రొమ్మును గుద్దడం నర్సారెడ్డికే సాధ్యమైందన్నారు . కష్ట కాలంలో పార్టీని కాపాడిన తమలాంటి వారిపై కక్షగట్టి మరో వ్యక్తిని మండలాధ్యక్షుడుగా ప్రకటించడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. నర్సారెడ్డి అవినీతిని కాంగ్రెస్ అధిష్టానానికి తీసుకుపోతామన్నారు. ఇలాంటి వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి నిజమైన కార్యకర్త అభిమానాన్ని చూడగొనాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి నర్సంపల్లి ప్రవీణ్ రెడ్డి బుల్లెట్ రాజు ,కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు సింగం రాజు యాదవ్ జ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల్లా కృష్ణారెడ్డి ,సీనియర్ నాయకులు భద్రయ్య నల్ల శ్రీను గొల్లపల్లి శేఖర్ బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాబు ప్రవీణ్ రెడ్డి వెంకటేష్ శేఖర్ రాజు, శ్రీకాంత్ చంద్రం రవి చెట్టి శ్రీనివాస్ చెట్టు శ్రీనివాస్ కనకయ్య పాల్గొన్నారు

ఈటల రాజేంద్రర్ ను కలసిన రాంరెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



మర్కుక్ బిజెపి మండ లాధ్యక్షులుగా మర్కుక్ చెందిన సాయిరెడ్డి రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షులు గామిడి మోహన్ రెడ్డి ప్రకటన చేశారు. సోమవారం మాజీ మంత్రి ఈటల రాజేందర్ ను రాంరెడ్డి శామీర్ పేట్ లో తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు..ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు టి.రమేష్ గుప్త, సుర్వీ కృష్ణమూర్తి, నాయకులు కిషోర్ రెడ్డి, సంజీవరెడ్డి, క్రాంతి, కృష్ణ,,తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఏడుగురు గైర్హాజరు

నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొమ్మిదవ రోజు జరిగిన ఇంటర్ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. సోమవారం ప్రథమ సంవత్సర విద్యార్థులు 173 మందికి గాను 166 మంది హాజరైనట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్ లేని విద్యార్థులను పరీక్షా కేంద్రానికి అనుమతించమన్నారు.

సాదా సీదాగా సామాజిక తనిఖీ

పొరపాట్లను సరిచూసుకోవాలి

నవతెలంగాణ -నంగునూరు



చిన్న చిన్న పొరపాట్లు సరిచేసుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని అడిషనల్ డీఆర్డీఓ పి.బాలక్రిష్ణ సూచించారు. సోమవారం నంగునూరు ఎంపీడీవో కార్యాలయం ముందు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ, ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఓ వైపు ప్రజాపాలన దరఖాస్తుల రీఎంట్రీ కోసం లబ్ధిదారుల క్యూలైన్ అరుపులు మరో వైపు సామాజిక తనిఖీ సాదాసీదాగా నిర్వహించారు. ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ పనులపై ఆర్పీలు నివేదికను చదువుతున్నారు. ఈజీఎస్ పథకంలో మొక్కలు ఎండిపోతున్నాయని, మస్టర్లు రాయడం లేదని, జరిగిన పొరపాట్లను సూచించి సంబంధిత పనులు చేయించిన వారి నుండి రికవరీ చేపట్టాలని ఏపీడీ ఆదేశించారు. ఈ ప్రజా వేదిక లో అంబుడ్స్‌మెన్ ఎం.డి.హరాఫ్, విజిలెన్స్ అధికారి వి.ప్రభాకర్, జేక్యూసీ సంతోష్ రెడ్డి, ఎస్సార్పీ రంజిత్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, సూపరిండెంట్ ప్రభాకర్‌రావు, ఇంచార్జి ఏపీఓ, ఈజీఎస్ ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్ సర్వర్ పాషా, క్యూసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆర్పీలు, మాజీ, తాజా ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి గ్రామానికి నిరంధించాలి

ఎంపీపీ లక్ష్మీ బీలు నాయక్

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో నీటి ఎద్దడి పై ఎంపీపీ లక్ష్మీ బీలు నాయక్, ఎంపీడీవో జయరాం ఆధ్వర్యంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 గ్రామాలలో ఉన్నటువంటి నీటి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కార్యదర్శులు, స్పెషల్‌ఆఫీసర్లు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్నాయని తెలియజేశారు. రాబోవు కాలంలో ఎండలు ఇంకా పెరిగే అవకాశం ఉందని, దానివల్ల నీటి సమస్య ఎక్కువ అవుతుందని తెలిపారు. చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల రావడంలేదని, కొన్ని గ్రామాల్లో వచ్చిన సరిపోవటం లేదని తెలియజేశారు. దీనిపై మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ ఏ ఏ గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్నాయో వాటిని తొందరగా పరిశీలించి, నివేదిక పంపించాలని అన్నారు. అట్టి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలియజేశారు. అధిక నీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని తెలియజేశారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు అధికారులు అలర్ట్ గా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు నీటి సమస్యతో బాధపడకూడదని, ఎలాగైనా నిరంధించాలని తెలియజేశారు. తదనంతరం ఎంపీడీవో జయరాం మాట్లాడుతూ ఏ ఏ గ్రామాల్లో నీటి సమస్య ఉందో ఆ గ్రామాల్లో పర్యటిస్తామని అన్నారు. భగీరథ నీరును వృధా చేయవద్దని తెలియజేశారు. అలాగే ప్రజలు మిషన్ భగీరథ నీటిని తప్పకుండా తాగాలని, అందులో అనేక పోషకాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కవి కుమార్, అక్కన్నపేట ఎంపీటీసీ సాంబరాజు, స్పెషల్ ఆఫీసర్లు ఏడి మహేష్, ఏఈలు మౌనిక రమ్య శ్రీ, మంజుల, గ్రామ కార్యదర్శులు, మోహన్, మహేష్, ప్రభాకర్, అమరేష్, అనూష, నిర్మల, జమున, దివ్య, స్వాతి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇందుప్రియల్‌లో మెగా వైద్య శిబిరం విజయవంతం

నవ తెలంగాణ -దౌల్తాబాద్

దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో మెడిసిటీ ఆస్పత్రి మెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. 135 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేపట్టగా 42 మందిని రకరకాల ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం మెడిసిటీ ఆసుపత్రికి తరలించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చాలామందికి బీపీ, షుగర్, కంటి చూపు,చెవి,ముక్కు,గొంతు,వరిబీజము, బీజకుట్టు,గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యామల కుమార్, సెక్రెటరీ రాజేష్, తాజా మాజీ వార్డు సభ్యులు సంగీతం లాస్య కృష్ణ, కో ఆప్షన్ ఎండి షాదుల్లా , కొత్తింటి స్వామి, గజ్వేల్ ముత్యాలు, వీరం చంద్రం చంద్రం, గ్రామ ప్రజలు, డాక్టర్లు ఒమార్ ,అభిషేక్ , సుచిత్ర , హషిత, రవిచంద్ర, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ ,లక్ష్మిలు తదితరులు పాల్గొనడం జరిగింది..

బాధపడొద్దు ఆదుకుంటా

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్ ం ఇటీవల అనారోగ్యంతో రాంపూర్ సర్పంచ్ బిక్షపతి మాతృమూర్తి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సోమవారం వారి కుటుంబా న్ని పరామర్శించారు. అధైర్యపడవద్దని ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. వీరి వెంట మాజీ సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



దళిత బహుజనులను అవమానిస్తున్న కాంగ్రెస్

కొండపాక మండల బిఆర్ఎస్ యువజన అధ్యక్షుడు దేవి నర్సింలు

నవ తెలంగాణ - కొండపాక

కాంగ్రెస్ పార్టీ దళిత బహుజనుల ను అవమానిస్తుందని బిఆర్ఎస్ పార్టీ కొండపాక మండల యువజన అధ్యక్షుడు దేవి నర్సింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రోజున కుకునూరు పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పక్షపాతి అని చెప్పుకోవడం తప్ప వారికి సరైన స్థానం కల్పించడం లేదని, దానికి నిదర్శనం సోమవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరి గుట్ట పర్యటనలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు జరిగిన అవమానమే నిదర్శనమన్నారు .మంత్రులకు కుర్చీలు వేసి ఉప ముఖ్యమంత్రి అయిన బట్టి విక్రమార్క ను చిన్న పిట పై కూర్చోబెట్టడ సమంజసం కాదన్నారు. మంత్రుల కంటే ఉపముఖ్యమంత్రి పదవి ఉన్నతమైనదని వారికి తెలియదా అని ప్రశ్నించారు. అంతేకాకుండా బీసీ కులానికి చెందిన దేవాదాయ శాఖ మంత్రి అయిన కొండా సురేఖను చిన్న పిట మీద కూర్చోబెట్టడం పట్ల కాంగ్రెస్ పార్టీ దళిత బహుజనుల పట్ల చూపిస్తున్న ప్రేమ నకిలీదని రుజువైందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రభుత్వ ప్రకటనలో ఉపముఖ్యమంత్రి ఫోటోను వేసేశారని కానీ ఇప్పుడు ఫోటో ఉండడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దళిత బహుజన పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ దళిత బహుజనులపట్ల ఇలాంటి సంఘటన పునరావృతమైతే గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, సాయి, రాజు ,స్వామి పాల్గొన్నారు

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

నవతెలంగాణ-మద్దూరు ం మండల పరిషత్ కార్యాలయంలో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 వరకు మద్దూరు, దూల్మిట్ట, మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను, మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు. ఎంపీడీవో రామ్ మోహన్ సోమవారం విలేకరులకు తెలిపారు. .గ్రామాలలో సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన కోరారు

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

సగానికి పైగా శాఖల అధికారులు గైర్హాజరు..

నామమాత్రంగానే చర్చ..

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

సిద్దిపేట అర్బన్ మండలం సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. సోమవారం సిద్దిపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు సగానికి పైగా వివిధ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఉన్నవారితో నామమాత్రంగానే చర్చించి సమావేశాన్ని ముగించారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం సూచించారు. వ్యవసాయ శాఖ సంబంధించిన అధికారులు మాట్లాడుతూ మూడు ఎకరాల తొమ్మిది గంటలకు మాత్రమే రైతుబంధు వచ్చిందని మిగతా వారికి త్వరలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ముగిపురుగు వ్యాప్తి చెందడంతో ఈసారి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. గ్రామస్థాయిలో సమస్యల పైన స్పెషల్ ఆఫీసర్లు దృష్టి సారించాలని ఈ



సందర్భంగా సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిసారి సమావేశం తూతూ మంత్రంగానే నిర్వహించడం చర్చకు వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో విఫలం కావడం ఎప్పుడూ ఇదే తంతు జరుగుతోందని కొంతమంది ప్రజాప్రతినిధులు గుసగుసలాడుకోవడం వినిపించింది. సమావేశంలో ఎంపీడీవో మార్టిన్ లూథర్, ఎమ్మార్వో సలీం, ఎంపీ ఓ శ్రీనివాసరావు పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్

డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ రఘురాం

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వ రంగ సంస్థల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ ఉన్నాయని వాటిని సద్వినియం చేసుకొని అభివృద్ధి చెందాలని డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ రఘురాం అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యములో అంతర్జాతీయ మహిళా దినోత్సవం, లీగల్ అవగాహన ప్రోగ్రాం కోర్ట్ కాంప్లెక్స్ లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఉన్నతమైన జీవితాన్ని అనుభవించాలని సూచించారు. ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ జడ్జి మురళి మోహన్ మహిళలకు ఉన్న చట్టాల గురుంచి వివరించారు. మహిళలను చిన్న చూపు చూడవద్దని, మహిళల పట్ల గౌరవంగా



ఉండాలని తెలిపారు. అనంతరం జిల్లా న్యాయసేవధికార సంస్థ ఆధ్వర్యములో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రములో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మిలింద్ కాంబ్లే, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చందన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావని యాదవ్, కోర్ట్ మహిళా సిబ్బంది, న్యాయసేవా సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం

ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ భరోసా

సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ



నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ మాజీ సర్పంచ్ రాజ్ మహ్మద్, ఉప సర్పంచ్ ముత్యాల రామచంద్రారెడ్డి మరియు టిఆర్ఎస్ బిజెపి నాయకులు శ్రీకాంత్, స్వామి,ఎర్రం మల్లేశం,దుబ్బా యాదగిరి,సిద్ధయ్య, రాజు,పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా చేరికల కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గరిపల్లి రాములు, మండల నాయకులు గుర్రం అంజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, పద్మా రెడ్డి , నాయకులకు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ రోడ్డు భూ బాధితులకు న్యాయం చేయాలి

నవ తెలంగాణ- రాయపోల్



ప్రభుత్వం చేపట్టే రీజనల్ రింగ్ రోడ్డు భూ బాధితులకు సరైన న్యాయం చేసి ఆదుకోవాలని బేగంపేట తాజా మాజీ సర్పంచ్ మద్ద ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం గజ్వేల్ ఆర్డీవో కార్యాలయంలో రీజనల్ రింగ్ రోడ్డు భూ బాధిత రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని ఎల్కల్,బేగంపేట్ గ్రామాల నుండి రీజినల్ రింగ్ రోడ్డు వెళుతుందని, ఈ రెండు గ్రామాలలో రీజినల్ రింగ్ రోడ్ కి భూములు కోల్పోయే రైతులకు నష్టపరిహారం పూర్తి స్థాయిలో చెల్లించి న్యాయం చేసి వారిని ఆదుకోవాలని ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. వ్యవసాయం మీదనే ఆధారపడి ఎల్కల్, బేగంపేట గ్రామాల రైతులు జీవనం సాగిస్తుంటారని అలాంటి రైతులకు జీవనాధారమైన వ్యవసాయ భూములు కోల్పోతే బతుకుతెరువు కష్టమవుతుందన్నారు. కాబట్టి ప్రస్తుత భూమి ధరలను బట్టి భూమి కోల్పోయే రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తొర్రి కుమార్, ఎల్కల్, బేగంపేట గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని మెదక్ వెళ్లె మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెర్రీస్ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ ను సోమవారం ఎమ్మెల్యే సునీత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డిని నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్, నాయకులు భోగ చంద్రశేఖర్, సత్యం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బిక్షపతి, ఆంజనేయులు, జగపతి రెస్టారెంట్ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి తొంట వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి జెడ్పీటీసీ విరాళం

నవ తెలంగాణ-నర్సాపూర్



శివంపేట మండల పరిధిలోని మాగ్దుంపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా తన వంతు సహాయంగా రూ.51 వేల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సోమ అశోక్, కత్తి గిరిబాబు, నర్సింలు, శ్రీనివాస్, హనుమంతు, స్వామి, చెన్నయ్య కృష్ణ, రాజశేఖర్ ,రాజు ,ఎండి షాబుద్దీన్, హర్షద్ ,సోము కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఐదుగురికి బంగారు పతకాలు

నవతెలంగాణ-నార్సింగి



మెదక్ జిల్లా వంనోవారాబాద్ లో నిర్వహించిన రెండవ జాతీయ కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ 2024 లో నార్సింగికి చెందిన ఐదుగురు బంగారు పథకాలు సాధించి విజేతలుగా నిలిచారు. మండలం నుంచి పది మంది బాల బాలికలు పోటీలలో పాల్గొనగా గీతిక, వర్షిణి, సహస్ర, వైష్ణవి, నరేందర్ లు తొలి స్థానం కైవసం చేసుకుని బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. యశస్విని, శరణ్య, ఆకుల సాయి చరణ్, వికాస్, మల్లికార్జున్ లు రెండో స్థానంలో నిలిచి వెండి పథకాలు సాధించారు. పోటీలలో పాల్గొన్న పది మంది బహుమతులు గెలుచుకోవడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విజేతలకు కరాటే మాస్టర్ సంపత్ కుమార్ అభినందించారు.

బోరు మోటార్లను ప్రారంభించిన ఎంపీపీ. జెడ్పీటీసీ

నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని శేరిపల్లి, వల్లూరు గ్రామాలలో ఎంపీపీ నిధుల నుంచి మంజూరైన సింగల్ ఫేస్ బోరు మోటార్లను ఎంపీపీ చిందం సబితా రవీందర్, జెడ్పిటిసి బాణాపురం కృష్ణారెడ్డిలు సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మీడియా తో మాట్లాడుతూ శేరిపల్లి గ్రామంలోని యాదవ కాలనీలో నీటి ఎద్దడి ఉందని తెలిసి సింగిల్ ఫేస్ మోటర్ మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే మరో సింగల్ ఫేస్ మోటర్‌ను కూడా మంజూరు చేసి నీటి ఎద్దడి తీర్చినట్లు వారు తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సంతోష గొండాస్వామి తమతో గ్రామంలో ఎండాకాలం వలన నీటి ఎద్దడి ఏర్పడిందని, దానికోసం రెండు సింగిల్ ఫేస్ మోటర్లు కావాలని అడిగారని, వెంటనే రెండింటికి రెండు మంజూరు చేయడం జరిగిందన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ సహకారంతో మరిన్ని నిధులు తీసుకొచ్చి మండలాన్ని ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. ఎండాకాలం వచ్చింది కాబట్టి తాగునీటి సమస్య ఉండకూడదని ముందుగా సింగల్ ఫేస్ మోటార్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష గొండా స్వామి యాదవ్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలారం బాబు, శేరిపల్లి తాజా మాజీ సర్పంచ్ చెప్యాలా మల్లేశం, వల్లూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్ అనందాస్ మహేశ్వరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ వహీద్, మున్నూరు కాపు సంగం అధ్యక్షుడు బోయిని రమేష్, మాజీ అధ్యక్షుడు గజవెల్లి రాములు, రమేష్ యాదవ్, సలేంద్ర కృష్ణ యాదవ్, కందరి శ్రీనివాస్ శ్రీరామ్ మల్లేశం, సత్యనారాయణ, నేరెళ్ల రవి, గొల్ల కిష్టయ్య, బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

16 అంశాలను ఆమోదించిన కౌన్సిల్ సమావేశం

నవతెలంగాణ- గజ్వేల్

సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 35 అంశాలకు గాను 16 అంశాలను ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. మిగిలిన అంశాలు వాయిదా వేసినట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సి సభ్యులు కోఆప్షన్ సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టకు రావాలని పలు కుల సంఘాలకు ఆహ్వానం

నవ తెలంగాణ -దుబ్బాక

పురపాలిక కేంద్రంలోని ఒకటో వార్డులో మారెమ్మ గడ్డ వద్ద నూతనంగా నిర్మించిన ఆంజనేయ సహిత శివపంచాయత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని కోరుతూ సోమవారం డిప్యూటీ కలెక్టర్ ఎస్.వై.గిరి ఆధ్వర్యంలో పలు కుల సంఘాలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. దేవాలయంలో ఈనెల 14 నుండి 16 వరకు మూడు రోజులపాటు జరిగే విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో దుబ్బాక పట్టణ, మండల పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పద్మశాలి సమాజం అధ్యక్షుడు గాజుల తిరుపతి డిప్యూటీ కలెక్టర్ ఎస్ వై గిరి ని శాలువాతో సన్మానించారు.

వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు

నవ తెలంగాణ - సిద్దిపేట

వేసవి కాలం సందర్భంగా వార్డులలో నెలకొన్న సమస్యలను వెంటనే అధికారులు, సిబ్బంది పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు ఆదేశించారు. మున్సిపల్ ఆఫీసులో సాధారణ సమావేశం చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఎజెండాలోని 10 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జంగిటి కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, పాల్గొన్నారు.

ముగిసిన కొండాపూర్ గట్టు మల్లన్న బ్రహ్మోత్సవాలు

నవ తెలంగాణ-మద్దూరు



దూల్మిట్ట మండలంలోని కొండాపూర్ గట్టు మల్లన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మల్లన్న స్వామికి పెద్ద పట్నం, వేసి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు మల్లన్న కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా జరిగిన గట్టు మల్లన్న బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాల బిల్లులు చెల్లించండి

గజ్వేల్‌లో పాలరైతుల నిరసన

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో విజయ పాల డైరీ యజమాన్యం రెండు నెలలుగా పాల బిల్లును చెల్లించడం లేదని సోమవారం గజ్వేల్ పాలశీతల కేంద్రం ముందు రైతులు నిరసనకు దిగారు. జగదేవ్పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన రైతులు తమకు రెండు నెలలుగా పాల బిల్లులు రావడం లేదని వెంటనే చెల్లించాలని వారు కోరారు. రైతులు నిరసన అనంతరం మేనేజర్ కు వినతిపత్రం అందించారు. వెంటనే బిల్లులు చెల్లించి సహకరించాలన్నారు. రెండు నెలలుగా 9000 లీటర్ల పాల బిల్లులు రైతులకు రావాల్సి ఉన్నదని వారు చెప్పారు. దీనిపై స్పందించిన మేనేజర్ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోతానని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు.

పార్టీలకతీతంగా అభివద్ధి పనులు...

సీసీ రోడ్డు శంకుస్థాపనలో జెడ్పీటీసీ కడగండ్ల కవిత

నవతెలంగాణ-బెజ్జంకి

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలని జెడ్పీటీసీ కడగండ్ల కవిత అన్నారు.సోమవారం మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ కడగండ్ల కవిత,పీఆర్ ఏఈ సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. నాయకులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఒగ్గు దామోదర్,చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,రామక్రిష్ణ రెడ్డి,చిలువేరు రాజు,హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లి లో ల్యాండ్ డెవలప్మెంట్ పనిని పరిశీలించిన ఎంపీడీవో

నవ తెలంగాణ-మద్దూరు

మండలంలోని వంగపల్లి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో ఉపాధి కూలీలకు పని కల్పించేందుకు ల్యాండ్ డెవలప్మెంట్ పని పరిశీలించినట్లు ఎంపీడీవో రామ్ మోహన్ సోమవారం విలేకరులకు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ఉపాధి హామీ పనికి వెళ్లే కూలీలు ఉదయం పూటనే వెళ్లి పనులు తొందరగా ముగించుకోవాలని ఆయన కోరారు. కూలీలు ఎక్కువ మంది హాజరుకావాలని ఆయన కోరారు. ఎండలు ఎక్కువ ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని స్థలం దగ్గర ఉంచుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్కు సూచించారు. అలాగే నర్సరీ, షేగ్రి గేషన్ షెడ్ను, పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు

పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

నవతెలంగాణ- గజ్వేల్

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు కరీముద్దీన్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ పాఠశాలలో కొమ్ము నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు, అదేవిధంగా కుర్చీలు సైతం అందజేశారు. యువత సమాజసేవలో ముందు ఉండాలని ప్రధానోపాధ్యాయులు కరీముద్దీన్ సూచించారు. పాఠశాల లో విద్యాభివృద్ధికి మౌలిక సదుపాయాల సహకారం కోసం నరేష్ యాదవ్ ముందుకు వస్తున్నారని ఆయనను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వేముల గట్టు మాజీ ఉపసర్పంచ్ బాలకిషన్, మాజీ సర్పంచ్ నర్సింలు, కనుక గౌడ్, పల్లె పహాడ్ డీలర్ నరసింహులు, కొమ్ము బాబు, శేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం లో పేదింటి కలలు సాకారం

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా 6 గ్యారంటీ లు అమలు చేస్తున్నదని, ఇందిరమ్మ రాజ్యం లో పేదింటి కలలు సాకారం అవుతున్నాయని టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజులు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం అర్హులైనవాళ్లు, రేషన్ కార్డ్ వున్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం మొదటగా సీఎం భద్రాచలం లో ప్రారంభించారని అన్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో 4,16,500 ఇల్లు లక్ష్యం గా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, నియోజకవర్గ అధ్యక్షులు బడేకొల్ రాకేష్ యాదవ్, నాయకులు మొగిలి రాకేష్, అనిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసినగండ్ల పాఠశాలకు బీరువా బహుకరణ

నవతెలంగాణ - కొండపాక

క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాజుల శ్రీనివాస్ జ్ఞాపకార్థం కొండపాక మండలం సిరిసినగండ్ల ఉన్నత పాఠశాలకు సోమవారం బీరువా బహుకరించారు. ఈ సందర్భంగా క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు లింగశ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది విఠల్ మాట్లాడుతూ ప్రతివ్యక్తి తాను సంపాదించినదానిలో కొంత సమజాసేవకు వినియోగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు పేదకుటుంబలకు చెందిన వారుంటారని వారికి సేవచేయడం సంతృప్తినిస్తుందన్నారు. గత 15 సంవత్సరాలనుంచి అసోసియేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో వివిధరకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నేషనల్ సైక్లింగ్ కు హుస్నాబాద్ వాసి ఎంపిక

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్

ఈనెల 28,29,30 తేదీల్లో హర్యానాలో జరిగే నేషనల్ పోటీలకు హుస్నాబాద్ కు చెందిన కయ్యం లక్ష్మీనారాయణ మెన్ కేటగిరిలో నేషనల్ సైక్లింగ్ కు ఎంపిక అయినట్లు తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ నిర్వాహకులు, సిద్దిపేట జిల్లా సైక్లింగ్ కోచ్ కే సంజీవ్ తెలిపారు. నేషనల్ సైక్లింగ్ లక్ష్మీనారాయణ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

లోనికుర్దు పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవం

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని లోనికుర్దు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమ వారం స్వయం పరిపాలనా దినోత్సవా న్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా శివకుమార్, హరీష్ మాలతి, హర్షఅరవింద్ వైష్ణవి, హారిక, మహీబ్బిన్నాజ్,ఉజ్మా అంజుమ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునేష్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం శివాలయానికి లక్ష విరాళం

నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి అక్షయ డెవలపర్స్ బౌరంపేటకు చెందిన సగ్గరి జీవేందర్‌రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా అందించారు. అలాగే బొల్లారానికి చెందిన పుల్లగుర్ల జైపాల్ రెడ్డి రూ.21,000, తుపల్లి భాస్కర్‌రెడ్డి రూ.5001 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షులు దమ్మగని రవీందర్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిదులు శ్రీనివాస్ రెడ్డి, పుట్టి భాస్కర్ ప్రతాప్ రెడ్డి, గొర్ల శ్రీనివాస్ యాదవ్ ,కోరబోయిన నరేష్, బండి మహేందర్ గౌడ్, గోపగని గోపి గౌడ్, రాజేందర్ రెడ్డి, వడ్ల ఆనంద్ చారి, బిక్షపతి చారి, శ్రీధర్ చారి, ప్రవీణ్, ప్రభాకర్ వని గుప్త, లక్ష్మణ్ గుప్తా బందం పాల్గొన్నారు.

చైర్మెన్‌కు శుభాకాంక్షలు తెలిపిన బరాడి శివ

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట మున్సిపల్ చైర్మెన్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన అపర్ణ శివరాజ్ పాటిల్‌ను 19వ వార్డ్ బీఆర్ ఎస్ ఇంచార్జ్ బరాడి శివ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోట పథ్వీరాజ్, బచ్చు రఘు ప్రసాద్, పరిగి శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు

నవతెలంగాణ-పటాన్‌చెరు



పటాన్‌చెరు క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా బీ.రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ క్రైమ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి హైదరాబాద్ నేరేడ్ మెట్టు క్రైమ్ ఇన్స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లగా.. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ క్రైమ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే 8712656725కు సమాచారం ఇవ్వాలన్నారు.

దుర్గమ్మ ఆలయ నూతన కమిటీ కార్యవర్గం



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామ దుర్గమ్మ ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా సిల్వేరి కృష్ణ, వైస్ చైర్మన్ సందబోయిన మల్లేశం, ప్రధాన కార్యదర్శులుగా అప్పీస బాబు, పసులాది నర్సింహులు, క్యాషియర్ గా యాంసాని రవీందర్, సలహాదారులుగా గూడ ఎల్లారెడ్డి, సంద యాదగిరి, జగ్గని బాబు, కార్యవర్గ సభ్యులుగా గుర్రం నారాయణ, వజ్జెపల్లి నర్సయ్య, కడవేరుగు రామచంద్రం, నెల్లుట్ల రాజు, సుద్దాల గణేష్, కడవేరుగు శివ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సిల్వేరి కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించినందుకు గ్రామస్తులకు ధన్యావాదాలు తెలిపారు. తన వంతుగా ఆలయ అభివృద్ధికి తోడ్పాడుతానని తెలిపారు.

ఉద్యానవన పంటలపై నేడు అవగాహన

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల డివిజన్ పరిధిలోని చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు మండలాల రైతులకు చేర్యాల మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు(మంగళవారం)ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు డి ఆర్.డి.శ్రీనివాస్, డాక్టర్ సుచిత్ర ఉద్యానవన పంటల పై (మామిడి లో పూత, పిందె రాలుట) అవగాహన కల్పిస్తారని చేర్యాల మండల వ్యవసాయ శాఖ అధికారి ఎండీ.అఫ్రోజ్ తెలిపారు.సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అవగాహన కార్యక్రమానికి రైతులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

చెడు వ్యసనాలకు విద్యార్థులు అలవాటు పడవద్దు

నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో గల ఉన్నత పాఠశాలను స్థానిక ఎస్సై చంద్రమోహన్ సోమవారం తనిఖీ చేశారు .ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్ఫోన్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భవిష్యత్తులో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని అందుకు అనుగుణంగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. మాదకద్రవ్యాలు అయిన ధూమపానం, మద్యపానం లాంటి వాటికి అలవాటు పడితే జీవితం నష్టపోతుందని విద్యార్థులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి ఉపాధ్యాయ బృందం ,పోలీస్ సిబ్బంది విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ఆటోను ఢీ కొట్టిన డీసీఎం వ్యాన్

ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ - కొండపాక

కొండపాక మండలం వెలికట్ట శివారులో రాజీవ్ రహదారిపై ఆటోను డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక గ్రామానికి చెందిన మదూరి రఘురాములు తన భార్యతో ఆటోలో సిద్దిపేటకు వైపు వెళ్తుండగా అదే దారిలో వస్తున్న టిసిఎం ఆటోను వెనక వైపు ఢీ కొట్టడంతో ఆటో పల్టీ పడింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న రఘురాములకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే టోల్ గేట్ అంబులెన్స్ సిబ్బంది చేరుకొని ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.